Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 26.04.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



### సీఎం Vs సీఎస్

# పవర్ వార్



- చంద్రబాబుకు చుక్కలు చూపిస్తున్న ఎల్.వి.ఎస్
- ఆర్థిక నిర్ణయాలపై సమీక్షలతో దడ
- జూన్ 8 దాకా నేనే సీఎం అంటూ బాబు బుకాయింపు

*స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నోసార్లు భారత పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. దేశంలోని అన్ని అసెంబ్లీలకు కూడా ఎన్నోసార్లు ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చేంతవరకు కూడా అప్పటి వరకు అధికారంలో వున్న ప్రధానమంత్రులైనా, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులైనా ఎన్నికల కోడ్‌ను గౌరవించినవాళ్ళే! నిబంధనలను బట్టి నడుచుకున్నవాళ్ళే! అంతేగాని, నేను ఫలానా తేదీన ఫలానా టైంకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసాను కాబట్టి గెలిచినా, ఓడినా ఆ టైం వరకు ఆ పదవిలోనే వుంటాను అని మొండికేసిన వాళ్లెవరూ లేరు.*

చరిత్రలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆ విధంగా చూస్తున్నాం. ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రంలో ఎన్నికలు ముగిసింది మొదలుకొని ఆయన వ్యవహరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ఎన్నికలకు ముందు తర్వాత ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు... వివాదాస్పద నిర్ణయాలు... ఎన్నికల తర్వాత ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు... నిబంధనలు అతిక్రమించి అధికారులతో సమీక్షలు... సదస్సులు... ఏ రాష్ట్రంలో కూడా

(మిగతా 11వ పేజీలో)



### మిస్టరీగా...

11లో

# వెంకన్నాస్ గోల్డ్

- తిరుమల వేదికగా మరో వివాదం
- అవకతవకలపై భక్తుల్లో ఆందోళన



### కుల

# గబ్బుసింగ్

- రెడ్లపై పడి ఏడుస్తున్న పవన్
- కులం లేదంటూనే కులం ప్రస్తావన

2019 ఎన్నికల్లో అటు తెలుగుదేశం నాయకులుగాని, ఇటు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు గాని కులాల ప్రస్తావనకు పెద్దగా పోలేదు. కులపిచ్చి ఎక్కువుగా వుండే తెలుగుదేశంలోనూ కులాల

(మిగతా 11వ పేజీలో)



# అకాల వర్షం.. అపార నష్టం!



**బత్తాయి.. బొప్పాయి రాలిపోయాయి. మామిడిరైతుల ఆశలు నేలరాలాయి. వరి ఓదెలు తడిసిపోయాయి.. ఈ వారంలో కురిసిన అకాల వర్షాలు మా కొంప ముంచాయంటూ రైతులు విలవిలలాడుతున్నారు. ఈ వర్షాలకు అటు తోటల రైతులు, ఇటు వరి రైతులు బాగా దెబ్బతిన్నారు. అదునుకు వానలు లేవు దేవుడా...అని ఒకవైపు రైతులు విలపిస్తుంటే, ఉన్నట్లుండి ఇప్పుడు అకాల వర్షాలు వచ్చి భారీ నష్టం కలిగిస్తుండడంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.**

జిల్లాలో వ్యవసాయ సీజన్ ఇంకా ప్రారంభం కాకముందే, రెండో పంటకు రైతన్నలు సిద్ధం కాకముందే హటాత్తుగా అకాల వర్షాలు వచ్చి జిల్లా రైతులను కష్టనష్టాల పాలు చేస్తున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో రైతులు గిట్టుబాటు ధర కోసం నిరీక్షిస్తూ ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకుంటున్న దశలో అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

## తోటల రైతులకు భారీ నష్టం..

ముఖ్యంగా తోటల రైతాంగానికి ఈ వానలు బాగా నష్టం కలిగించాయి. కొద్దిరోజులుగా సాయంత్రమైతే చాలు, ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో వర్షాలు కురవడం జరుగుతోంది. దీంతో, మెట్టప్రాంతాలైన ఆత్మకూరు, వింజమూరు, మర్రిపాడు, వెంకటగిరి, సీతారామపురం, ఉదయగిరి, జలదంకి, కొండాపురం, దుత్తలూరు, కలువాయి, ఏఎస్‌పేట, పొదలకూరు, రాపూరు, ఓజిలి, చేజర్ల, సంగం, కలిగిరి, దక్కిలి, వెంకటగిరి మండలాలతో పాటు తీరప్రాంతాలైన ముత్తుకూరు, అల్లూరు తదితర ప్రాంతాల్లో వేలాది హెక్టార్లలో తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక మండలాల్లో నిమ్మతోటల్లో కాపుకు వచ్చిన నిమ్మకాయలు నేలరాలిపోయాయి. బత్తాయి, బొప్పాయి తోటల్లో కాపుకు వచ్చిన కాయలన్నీ రాలిపోయాయి. మామిడితోటలు బాగా దెబ్బతిన్నాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాలెం, దేపూరు, కనుపూరుపల్లి తదితర గ్రామాల్లో తోటలకు భారీనష్టం వాటిల్లింది. ఉన్నట్లుండి వచ్చిపడుతున్న ఈ వర్షభీభత్సానికి తోటల రైతులు హడలిపోతున్నారు. పలుచోట్ల విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## ఉరుములు మెరుపులు.. ఈదురుగాలులు...

అకాలవర్షాల భీభత్సంతో అనేకప్రాంతాల్లో పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు కూడా పడడంతో జనం బెంబేలెత్తిపోయారు. మర్రిపాడు మండలంలోని పొంగూరు గ్రామంలో పిడుగుపాటుకు గురై ఒక వ్యక్తి మరణించాడని సమాచారం. తిక్కవరం గ్రామంలో పొలాల్లో మేతమేస్తున్న పది గొర్రెలు పిడుగుపాటుకు హరీ మన్నాయి. దీంతో గొర్రెల యజమాని లబోదిబోమంటున్నాడు. వేగంగా వీచిన ఈదురుగాలుల దెబ్బకు దుత్తలూరు ప్రాంతంలో అక్కడక్కడా విద్యుత్‌స్తంభాలు నేలకొరిగిపోయాయంటే ఎంత బలమైన గాలులు వీచాయో అర్థమవుతుంది. మరోవైపు, అసలే ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా ఈ అకాలవర్షం వచ్చి మా కొంప ముంచిందని మరికొందరు రైతులు ఆవేదన చెందుతున్నారు. గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో ఇంకా అనేకమంది ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచారు. మరికొంతమందేమో ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. ఆత్మకూరు, అనంతసాగరం మండలంలో అనేకచోట్ల పొలాల్లో ఉన్న ధాన్యం ఓదెలు ఈ అకాలవర్షానికి తడిసిపోవడంతో, ఇన్నాళ్ళ కష్టం చేతికందేలోగా నీటిపాలయ్యిందంటూ రైతులు కంటతడి పెడుతున్నారు.

## నెల్లూరులో చిరుజల్లులు :

ఈనెల 21, 22 తేదీల్లో కురిసిన చిరుజల్లులు ప్రజలకు ఒకింత ఉపశమనం కలిగించాయి. నెల్లూరు నగరంలో నల్ల మబ్బులు కమ్ముకోవడంతో నగరంలో కుండపోత వాన వస్తుందని, ఈ ఎండల ధాటికి వేడెక్కి ఉన్న భూమి చల్లబడుతుందని అనుకున్నారు కానీ, షరా మామూలుగానే మేఘాలు చూస్తుండగానే తేలిపోయాయి. అక్కడక్కడా కురిసీ కురియనట్లు చిరుజల్లులు మాత్రమే కురిశాయి. అవి ఈ ఎండల్లో కాస్త ఉపశమనం కలిగించినట్లు అన్పించినా, మళ్ళీ తెల్లారేసరికి ఎండ మిడిమేళంగా కాయడంతో నగర ప్రజలు ఎండదెబ్బకు అల్లాడిపోయారు.

# మరణం కాదు..
# శాశ్వత జీవనం

## నెల్లూరులో మరో అవయవదానం



ఒక మంచి పని మొదలుపెడితే ప్రజలు ఎంతగా ఆదరిస్తారో, ఎంతగా స్పందిస్తారో అనే దానికి ఇటీవల తరచూ జరుగుతున్న అవయవ దానాల సంఘటనలే ఉదాహరణ. కొన్నేళ్ళ క్రితం ప్రజలలో అవయవదానంపై పెద్దగా అవగాహన ఉండేది కాదు. కాని, ఇప్పుడు ఈ విషయమై ప్రజల్లో చైతన్యం వచ్చింది. ప్రతి వ్యక్తిలోనూ మానవత్వం మేల్కొంటోంది. ఒక ప్రాణం పోతున్న సమయంలో ఆ ప్రాణం ద్వారా ఇంకొందరి ప్రాణాలను నిలబెట్టాలని చూస్తున్నారు.

నెల్లూరుజిల్లాలో అవయవదానంపై పూర్తి చైతన్యం వుంది. ప్రమాదాలకుగురై ఎవరు బ్రెయిన్‌డెత్‌లోకి వెళ్ళినా వారి అవయవ దానంతో ఇంకొందరికి ప్రాణదానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకొస్తున్నారు. ఇలాంటి మనవతా ఘటనే నెల్లూరులో నారాయణ ఆసుపత్రి కేంద్రంగా చోటుచేసుకుంది.


నెల్లూరు వేదాయపాలెంలో రుచి రెస్టారెంట్ యజమాని తాతా రమణయ్యగౌడ్ ఈ నెల 20వ తేదీ రాత్రి 7.30గంటల సమయంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బైక్‌పై వస్తున్న ఆయనను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన ఆయనను నారాయణ ఆసుపత్రికి తరలించగా మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ నిర్వహించారు. అయినా పరిస్థితి మెరుగుపడక రమణయ్య బ్రెయిన్‌డెత్‌కు గురయ్యాడు. ఈ విషయాన్ని వైద్యులు రమణయ్యగౌడ్ కుటుంబసభ్యులకు తెలియజేయగా, అంత విషాదంలోనూ మానవత్వంతో ఆలోచించారు. అవయవదానానికి ముందుకొచ్చారు. దీంతో జీవన్‌దాన్ సహకారంతో నారాయణ వైద్యులు రమణయ్యగౌడ్ అవయవాలను సేకరించారు. గుండెను, కిడ్నీలను, నేత్రాలను సేకరించి ఆయా ఆసుపత్రులలో అవసరమైన రోగులకు అమర్చేందుకు తరలించారు. ఈ విధంగా రమణయ్యగౌడ్ తాను చనిపోతూ మరికొందరికి ప్రాణదాత అయ్యాడు.

# యుఎన్ఆర్‌లో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులతో పాల్గొన్న నుడా శీనయ్య

నెల్లూరులోని నవాబుపేట రామ చంద్రాపురంలో ఉన్న యుఎన్ఆర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఈనెల 24న ఎంతో వేడుకగా జరిగాయి. ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి ప్రమోట్ అవుతున్న యుకెజి చిన్నారులకు నిర్వహించిన ఈ గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్యఅతిథిగా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని పాఠశాల నిర్వాహకులను అభినందించారు. ఎంఇఓ జగదీష్, మాజీ ఎంఇఓ నరసయ్య, ప్రముఖ సైకాలజిస్ట్ రమేష్‌బాబు, ఏఎంసి మాజీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, గీతాజంలి స్కూల్ కరెస్పాండెంట్ వెంకటరామయ్య, యుఎన్ఆర్ కరెస్పాండెంట్ యు.నరసారెడ్డి పాల్గొన్నారు.



## రాజరాజేశ్వరమ్మ సన్నిధిలో
# కంచిస్వామి పాదుకలు

కంచి కామకోటి పీఠాధిపతి, ఈ భూమిపై ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లిన పూజ్యులు చంద్రశేఖర సరస్వతి మహాస్వామి పవిత్ర పాదుకలను 24వ తేదీ నెల్లూరులోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వుంచి పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పాదుకలను దర్శించుకున్నారు. జిల్లా యాత్రలో భాగంగా విచ్చేసిన పాదుకలకు ఆలయం వద్ద ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇ.ఓ వి.శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

## ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్
# మజ్జిగ చలివేంద్రం

నెల్లూరు చిన్నబజారులో వేసవి దృష్ట్యా ఈ ప్రాంతానికి వచ్చే ఖాతాదారుల దాహం తీర్చడం కోసం ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ వారు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 24వ తేదీన నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ఎం.పి.ఆంజనేయులు, కోశాధికారి శోభన్‌బాబు, సభ్యులు ఏల్చూరి శ్రీనివాసులు, రాధాకృష్ణయ్య, గోపీకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అమానుషం...
# ఈ మారణహోమం

ఈస్టర్ పండుగ రోజు శ్రీలంకలో జరిగిన బాంబు పేలుళ్ళను అమానవీయచర్యగా జమాతే ఇస్లామిక్ హింద్ నెల్లూరు నగర అధ్యక్షులు యం.డి.షహబుద్దీన్ అభివర్ణించారు. ఇది క్షమించరాని నేరమని, ఏ మతం కూడా ఇలాంటి మారణ హోమాలను క్షమించదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతికలగాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని
# ధ్వంసం చేయడం దారుణం

భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి దళిత గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఏపి దళిత ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి అరవ పూర్ణ ప్రకాష్ డిమాండ్ చేసారు. ఈనెల 23న నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్‌భవన్‌లో ఏపి దళిత సేన - ఏపి దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చి చెత్తకుప్పలో వేయడం దారుణమన్నారు. అంబేద్కర్ విగ్రహానికి జరిగిన అవమానంను రాజ్యాంగానికి జరిగిన అవమానంగా భావిస్తున్నట్లు తెలిపారు. విగ్రహం ధ్వంసం జరిగిన విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. జోగి శ్రీకాంత్, లింగాల రవి, దద్దోలు మల్లి, వరాల లక్ష్మీనారాయణ, వీరమణి సుధా, లింగాల గోపి, పోతురాజు రవి పాల్గొన్నారు.

# కారణజన్ముడు.. సేవా ప్రభాకరుడు

## ఆనందోత్సవంగా విపిఆర్ జన్మదినోత్సవం

రాజ్యసభ సభ్యులు, సేవాతత్పరులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 63వ జన్మదిన వేడుకలను ఈ నెల 19వ తేదీన నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విపిఆర్ సంస్థల సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విపిఆర్ బర్త్‌డేని తమ ఇంట్లో వేడుకగా భావించి ఈ వేడుకల్లో భాగస్వాముల య్యారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి విపిఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజాసేవకే పుట్టాడని, ఈ జిల్లాలో ఆయన పుట్టడం ఈ జిల్లా వాసులు చేసుకున్న అదృష్టమని అన్నారు. ఆయన నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నానని, విపిఆర్ ద్వారా నెల్లూరు జిల్లాకు మరిన్ని సేవా కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో విపిఆర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ విజయకుమార్‌రెడ్డి, చీఫ్-కోఆర్డినేటర్ శంకర్, జిఎం-పిఆర్ రాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇంజనీర్ వెంకటస్వామి రెడ్డి, డా. సత్యనాథ్, రామచంద్రారెడ్డి, విపిఆర్ విద్య, వైద్యం, కన్వెన్షన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



విపిఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి

## వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు



ఈ నెల 19వ తేదీన ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, అనుచరులు నెల్లూరులో ఆనందంగా జరుపుకున్నారు. నెల్లూరులోని ప్రఖ్యాత ఫర్నీచర్ సంస్థ 'అమ్మ ఫర్నిచర్' అధినేతలు గడ్డం సుధాకర్‌రెడ్డి, సుమన్ రెడ్డి, సుజయ్‌రెడ్డి మరియు మద్దిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఆయన కుమారుడు మద్దిరెడ్డి సాయి శ్రీకర్‌రెడ్డిలు వేమిరెడ్డి ముఖ చిత్రంతో కూడిన భారీ బెలూన్‌ను మినీ బైపాస్‌లోని రిలయన్స్ ట్రెండ్జ్ బిల్డింగ్‌పై ఎగురవేసి వినూత్న రీతిలో తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సేవాదినంగా విపిఆర్ జన్మదినం

అలాగే విపిఆర్ యువసేన ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ విద్యలో రక్తదాన శిబిరం నిర్వహించారు. చిల్డ్రన్స్ పార్క్‌రోడ్డులోని సాయిబాబా మందిరంలో అన్నదానం నిర్వహించారు. అంధుల పాఠశాలలో విపిఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు.

## అంగరంగ వైభోగం...

# శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవం



కనుల పండువగా రథోత్సవం

బుచ్చిరెడ్డిపాలెంలోని అతిప్రాచీనమైన శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానం 235వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీన మొదలై 22వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగాయి. 12వ తేదీ అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 13వ తేదీ ధ్వజారోహణం, శేష వాహనం, 14వ తేదీ సూర్యప్రభ వాహనం, హంస వాహనం, 15వతేదీ యాళి వాహనోత్సవం, 16వ తేదీ హనుమంతుసేవ, 17వ తేదీ మోహిని అవతారోత్సవం, గరుడసేవ, 18వ తేదీ కళ్యాణోత్సవం, గజవాహన సేవలు కనులపండువగా జరిగాయి. 19వ తేదీ ఉదయం రథోత్సవానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సీతా సమేత శ్రీరాముడు రథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆరోజు రాత్రి తెప్పోత్సవం, పొన్నమానుసేవ జరిగాయి. 20వ తేదీ అశ్వవాహనం, 21వ తేదీ చక్రస్నానం, 22వ తేదీ ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్స వాలలో భాగంగా ప్రతిరోజూ దేవస్థానం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు.




వేమిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేస్తున్న విపిఆర్ యువసేన సభ్యులు



## 'ప్రభా'తం

# లంకలో రాక్షసకాండ

**శ్రీలంకను కేంద్రంగా చేసుకుని ఉగ్రవాద రాక్షసులు ఆత్మాహుతి బాంబు దాడులకు తెగబడి వందలాదిమంది అమాయకుల్ని పొట్టనబెట్టుకోవడం అత్యంత దారుణం!.. ఈ దాడుల్లో 321 మంది మరణించివుంటారని అంచనా.. ఇంకా వందలాదిమంది గాయాల పాలయ్యారు. ఉగ్రవాదుల కిరాతకత్వాలకు ప్రపంచవ్యాప్తంగా ఇలా అమాయకులెందరో బలైపోతున్నారు. ఇకనైనా ప్రపంచం మేలుకోవాలి.. అన్ని దేశాలు కలసికట్టుగా ఈ రాక్షసమూకల అంతు చూడాలి. అప్పుడే ప్రపంచానికి శాంతి! మానవాళికి కాంతి!....**



శ్రీలంకలో ఉన్నట్లుండి ఉగ్రవాద రాక్షసులు పెట్రేగిపోయారు. వందలాదిమంది అమాయకుల్ని పొట్టనబెట్టుకుని రక్తదాహాన్ని తీర్చుకున్నారు..తమ రాక్షసప్రవృత్తిని మరోసారి చాటుకున్నారు. శాంతి సామరస్యతలకు నిలువెత్తు సంకేతమైన క్రీస్తు పునరుత్థానం రోజున..ఎంతో పవిత్రమైన ఈస్టర్ పండుగ నాడు..ప్రపంచమంతా సంబరంలో ఉండగా..ఆనందోత్సాహాలతో క్రైస్తవసోదరులంతా చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించుకుంటూ ఉండగా, ఇదే అదనుగా భావించిన నరరూప రాక్షసులు బాంబుదాడులకు తెగబడి అమాయకుల ప్రాణాలు తీశారు. శ్రీలంకను కేంద్రంగా చేసుకుని ఆత్మాహుతి బాంబుదాడులకు తెగబడి వందలాదిమంది ప్రజల్ని బలిగొనడం ఎంత దారుణం?..ఎంత ఘోరం?.. ఈ ఉగ్రరక్కసుల నరమేధాల్లో బలైనవారి సంఖ్య 321 మంది దాకా ఉంటుందని తాజా అంచనా. మృతులు కాక, మరో అయిదారువందల మందికిపైగానే అభాగ్యులు ఈ పాపిష్టి రాకాసిమూకల బాంబుదాడుల గాయాలకు నెత్తురోడుతూ కాళ్లు తెగి, చేతులు తెగి...విలవిలలాడుతున్నారు. ఒక్కసారిగా చడీచప్పుడు లేకుండా విరుచుకుపడిన ఉగ్రపిశాచుల కిరాతకత్వం..పైశాచికత్వానికే పరాకాష్టగా నిలిచింది. ఈ భీకరదాడులతో శ్రీలంక ప్రాన్పడిపోయింది. అమాయకులపై కనీవినీ ఎరుగని ఈ దాడులతో ప్రపంచమే నివ్వెరపోయింది. శ్రీలంక రాజధాని కొలంబో నగరంలో ప్రసిద్ధిచెందిన సెయింట్ ఆంటోని చర్చితో పాటు, ప్రధానమంత్రి అధికారిక నివాసానికి సమీపంలోనే ఉన్న సిన్నమోన్ గ్రాండ్ హోటల్, షాంగ్రిలా హోటల్, కింగ్స్‌బరీ హోటల్స్‌లో జరిగిన ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడులతో ఆ ప్రాంతాలన్నీ నెత్తురు కాలువలే అయ్యాయి. గుండెలవిసేలా బాధితుల ఆర్త నాదాలతో.. ప్రాణభయంతో చేసిన హాహాకారాలతో ఆయా ప్రాంతాలు భయానకంగా మారాయి. కొలంబోకు సమీపంలోనే ఉన్న నెగొంబోలోని సెయింట్ సెబాస్టియన్ చర్చి, బట్టికలోవా లోని జియోన్ చర్చిపై జరిగిన దారుణ మారణహోమంలో పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడుల్లో సుమారు పదిమంది భారతీయులతో సహా, 38 మంది దాకా విదేశీయులు కూడా మృతిచెందినట్లు సమాచారం. బాంబుపేలుళ్లలో సుమారు 45 మంది చిన్నారులు చనిపోయి ఉంటారని, ఉగ్రదాడులకు ఆ పసిమొగ్గలు బలైపోయాయని యునిసెఫ్ ఆవేదన వ్యక్తం చేసింది. మనిషన్న ప్రతివాడినీ కంటతడిపెట్టించే ఈ దారుణాలతో శ్రీలంక కంటికి కడివెడు శోకం అన్నట్లుగా రోదిస్తోంది.

చర్చిలు, పెద్దపెద్ద హోటళ్లను లక్ష్యంగా చేసుకుని శ్రీలంకలోవరుస బాంబుపేలుళ్ళు చేసింది తామేనని, ఈ ఆత్మాహుతి బాంబుదాడుల్లో అమెరికా మిత్రపక్షదేశాల పౌరులను, శ్రీలంక క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నామని, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ సభ్యులే ఈ దాడులు నిర్వహించారని ఉగ్రవాద మూకల ముఠాగా ఉన్న ఇస్లామిక్‌స్టేట్ (ఐఎస్) ప్రకటించుకోవడం చూస్తే, ఉగ్రవాద ముఠాలు ఎంత బరితెగించిపోతున్నాయో అర్థమవుతుంది. కాగా, సెయింట్ సెబాస్టియన్ చర్చిలోకి ఆత్మాహుతి బాంబర్ ఒకరు బాంబుల బ్యాగ్‌తో ప్రవేశిస్తున్న దృశ్యాల వీడియో ఒకటి తాజాగా వెలుగులోకి రావడం సంచలనం కలిగిస్తోంది. ఇదిలావుంటే, గత మార్చి 15న న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్ మసీదుల్లోకి జొరబడి ఒక శ్వేతజాత్యహంకారి 50 మంది ముస్లిమ్‌లను విచక్షణారహితంగా కాల్చి చంపడంతో, అందుకు ప్రతీకారంగానే ఉగ్రవాదులు ఇక్కడ ఈ దాడులకు తెగబడి ఉండవచ్చనే అనుమానాలూ లేకపోలేదు. అయితే శ్రీలంకలో ఉన్న ఇస్లామిక్ అతివాదులు ఈ దాడులు చేసి ఉంటారని, అతివాద ముఠాగా పేరుమోసిన నేషనల్ తౌహీత్ జమాత్ (ఎన్‌టిజె) అనే ఉగ్రసంస్థ పైనే తమకు అనుమానాలున్నాయని శ్రీలంక ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ ఎన్‌టిజె అనే ఉగ్రవాద సంస్థ శ్రీలంకలో భారీ విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందంటూ భారత్ నిఘావర్గాలు కొద్దిరోజుల ముందే హెచ్చరించినా శ్రీలంక పట్టించుకోలేదు. అయినప్పటికీ, ఉగ్రదాడులతో భీతిల్లుతున్న శ్రీలంకకు భారత్ అండగా నిలుస్తుందంటూ ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ మేరకు పేలుళ్ళ దర్యాప్తులో శ్రీలంకకు భారత్ తన సాంకేతికపరమైన, నిఘాపరమైన సహకారం అందించడానికి సిద్ధమైంది కూడా. ఇప్పుడే కాదు గతంలోనూ ఉగ్రవాదులు ఈస్టర్ పండుగను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. 2016లో లాహోర్‌లో 75 మందిని, 2017లో ఈజిప్టులో మరో 45 మందిని చంపి తమ రక్తదాహాన్ని తీర్చుకున్నారు. వాటికంటే కూడా ఇప్పుడు శ్రీలంకలో జరిగిన ఘోరం మరీ పెద్దది. ఐఎస్ ఉగ్రవాద సంస్థ అనే పాములపుట్టలోంచి కుప్పలు తెప్పలుగా పుట్టిన విషసర్పాలెన్నో ప్రపంచవ్యాప్తంగా విస్తరించి.. ఇలాంటి దారుణ మారణకాండలు సాగిస్తున్నాయి. శ్రీలంకలో ఉగ్రవాదం బాగా తగ్గిపోయిందనుకుంటున్న తరుణంలో ఇలాంటి భారీ నరమేధం జరగడం చూస్తే.. ఉగ్రవాద మూకలు ఎంతగా మాటువేసివున్నాయో అర్థమవుతోంది. ఏదేమైనా.. ఉగ్రవాద రాకాసుల దాడులతో శ్రీలంక గుండె చెదిరింది. ఉగ్రవాద రాకాసి ఎంతటి కిరాతకమైనదో, అభంశుభం ఎరుగని అమాయకప్రజలను, పసిబిడ్డలను సైతం ఎంత నిర్దయగా చంపుకుతింటుందో శ్రీలంకలో జరిగిన దారుణ రాక్షసకాండ ఒక నిదర్శనం. ఉగ్రవాద మంటే ఉన్మాదం. కిరాతకత్వం తప్ప మానవత్వం అనేదే అందులో ఉండదు. అమాయకుల్ని చంపి రాక్షసానందం పొందడమే ఉగ్రవాదం లక్ష్యం. ఎప్పుడు ఏ దేశంపై ఎలాంటి ఉగ్రచర్యకు పాల్పడతారో తెలియదు. ఆ ఉన్మాదులు ఇంకా ఇలా ఎందరు అమాయకుల్ని బలితీసుకుంటారో తెలియదు. ఇకనైనా ప్రపంచం మేలుకోవాలి!... ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు కలసికట్టుగా కదిలి ఉగ్రవాద పిశాచమూకల అంతుచూడాలి. ఉగ్రవాద విషవృక్షాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించాలి. అందుకు అందరూ సహకరించాలి. ఉగ్రవాదం అంతానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలి!..

అప్పుడే ప్రపంచానికి శాంతి!... మానవాళికి కాంతి!...

---

# భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

## - చర్చిల్లో సందడే సందడి



ఈ నెల 21వ తేదీ ఎంతో పవిత్ర మైన ఈస్టర్ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా క్రైస్తవ సోదరులు, వారి కుటుంబసభ్యు లందరూ ఎంతో ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని చర్చిలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు పునరుత్థానం రోజున జరిగిన ఘటనలను పాస్టర్లు అందరికీ వివరించారు. శాంతిని, సహనాన్ని ఏసుక్రీస్తు బోధించారని, ప్రపంచ మానవాళి అంతా ఒకరికొకరి పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని, ఆకలితో ఉన్నవారికి, ఆపదలో ఉన్నవారికి అందరూ సాయపడాలని ప్రబోధించారని, ఏసుక్రీస్తు బోధనలు మార్గదర్శకంగా చేసుకుని అందరం జీవించాలని పాస్టర్లు ఈ సందర్భంగా ఉద్బోధించారు. నెల్లూరు లోని విఆర్‌సి సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్ట్ చర్చి డానీహాల్‌లో చీఫ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో ఈస్టర్ వైశిష్ట్యాన్ని వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రముఖ దైవప్రసంగీకుడు జి.ప్రకాశ్ వాక్యోపదేశం చేశారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న లోన్‌స్టార్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్, రెవరెండ్ సాలె విజయకుమార్ ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. సుబేదారుపేటలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో బిషప్ రెవరెండ్ ప్రకాశం, ఫాదర్ జోసెఫ్, ఫాదర్ విలియం ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి ఏసుక్రీస్తు పునరుత్థాన ప్రాధాన్యతను వివరించారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని యువతీయువకులు చర్చిల్లో ప్రత్యేక భక్తిగీతాలను ఆలపించారు.

## కసుమూరు మస్తానయ్య దర్గాకు..

## భక్తజనం వెల్లువెత్తారు

వెంకటాచలం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు ఈనెల 21వ తేది ఆదివారం నాడు భక్తజనం భారీగా తరలివచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో దర్గాను దర్శించుకున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని అనేకప్రాంతాల నుంచి భక్తజనం వెల్లువెత్తారు. అనేక మంది భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అత్యధికశాతం భక్తులు తలనీలాలు సమర్పించుకుని దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ దర్గాను నిర్వాహకులు పూలమాలలతో, విద్యుద్దీపాల తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు.

---

## ఈవిఎంలపై ఏడుపెందుకు?

ప్రపంచానికి టెక్నాలజీని పరిచయం చేసింది నేనే అని చెప్పుకునే చంద్రబాబునాయుడు ఇప్పుడు ఈవిఎంలపై పడి ఎందుకేడుస్తున్నట్లు? ఈవిఎంలను ఎత్తేసి బ్యాలెట్ పేపర్లు ప్రవేశపెట్టాలని ఎందుకు కోరుతున్నట్లు? బ్యాలెట్ ద్వారా అయితే రిగ్గింగ్ బాగా చేసుకోవచ్చనా? అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయొచ్చనా? రాజ్యాంగ వ్యవస్థలపై చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నాడు. ఆయన అడ్డదారుల ముఖ్యమంత్రి. అన్నీ అడ్డంగానే ఆలోచిస్తాడు. తన ఆలోచనా రీతిలోనే అందరూ ఆలోచిస్తుంటారని భ్రమపడుతుంటాడు.

**కె.సి. దయాకర్, నెల్లూరు.**

## ప్రభుత్వ డబ్బుతో ఓట్లు కొనడమా?




ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి ప్రభుత్వ సొమ్ముతోనే ప్రజల ఓట్లు కొనే ప్రయత్నం జరిగింది. ఎన్నికల వేళ సీఎం చంద్రబాబు ప్రకటించిన పసుపు – కుంకుమ, అన్నదాత సుఖీభవ, పింఛన్ల పెంపు వంటి తాత్కాలిక పథకాలన్నీ ప్రభుత్వ సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేయడమే. చంద్రబాబు అధికార దాహంతో ఖజానా ఖాళీ చేశారు. ఉద్యోగులకు జీతాలకూడా డబ్బుల్లేవ్. ఈయనను అందరు సీఎంలు ఆదర్శంగా తీసుకుంటే భారతదేశంలో 29 వెనిజులాలు తయారవుతాయి. ఫ్రీగా డబ్బులిచ్చే పథకాలపై కేంద్రం, సుప్రీం కోర్టు ఒక నిర్దిష్ట విధానాన్ని తీసుకురావాలి.

**కలిచేడు రమ, గూడూరు.**

## హిందువులకేంటి ఈ దౌర్భాగ్యం

హిందువులు మెజార్టీగా వుండే ఏ ప్రాంతంలో కూడా మైనార్టీలను ఓట్లేయకుండా అడ్డుకోలేదు. మైనార్టీల ఓటు హక్కును ఎవరూ అడ్డగించలేదు. కాని పశ్చిమబెంగాల్‌లో మాత్రం హిందువులను ఓట్లేయకుండా తృణమూల్ కాంగ్రెస్ గూండాలు అడ్డుకున్న సంఘటనలు కలవరపెడుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఇప్పుడే హిందువుల పరిస్థితి ఇంత దారుణంగా వుంటే భవిష్యత్‌లో ఇంకెంత అధ్వాన్నంగా మారబోతుందో.? తృణమూల్ కాంగ్రెస్ మమతా బెనర్జీ పీడను వదిలించుకున్నప్పుడే బెంగాల్ హిందువులకు మనశ్శాంతి.

**సి. రాజీవి, నెల్లూరు.**

# ఓటరన్నపై... గంపెడాశలు పెట్టుకున్న నేతలు

● ఉదయగిరి

## ఆశల్లో వైసిపి...

## అంచనాల్లో టిడిపి

జిల్లాలో వైసిపి బలంగా ఆశలు పెట్టుకున్న నియోజకవర్గాలలో ఉదయగిరి ఒకటి. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి నియోజకవర్గం. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, వైసిపి అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు తలపడడం తెలిసిందే!

నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యేగా బొల్లినేని రామారావుపై మొదటి నుండి వ్యతిరేకత కనిపించింది. ఆయనకు మళ్ళీ సీటివ్వొద్దంటూ టీడీపీ నాయకులే చంద్రబాబు చెవిన ఇళ్ళు కట్టుకుని శతపోరారు. రామారావు కూడా ఇస్తే ఇవ్వండి లేకుంటే లేదు అన్నట్లుగానే వుండిపోయాడు. కాని, విధిలేని పరిస్థితుల్లో రామారావుకే సీటివ్వాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గంలో కొంచెం కులపోరు ఎక్కువ. ఎమ్మెల్యేపై వ్యతిరేకత పక్కనపెట్టి కమ్మ సామాజిక వర్గమంతా ఏకమైంది. బొల్లినేనికి గట్టిగానే పని చేశారు. మండలస్థాయిలో పార్టీ కేడర్ కూడా బాగా పనిచేసింది. మండలాల వారీగా అంచనాలు వేసుకుంటూ తెలుగుదేశం నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. కొండాపురం, వరికుంటపాడు, దుత్తలూరు, జలదంకి మండలాలలో తమకు మెజార్టీ వస్తుందని, సీతారాంపురం, ఉదయగిరి, కలిగిరి మండలాలలో వైసిపికి స్వల్ప ఆధిక్యమేనని, వింజమూరు మండలంలో ఎవరికీ పెద్ద మెజార్టీ రాకపోవచ్చునని అంచనాలు వేస్తున్నారు.





వైసిపి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 2014 ఎన్నికల పొరపాట్లను ఈ ఎన్నికల్లో రిపీట్ కానీయలేదు. కావ్య కృష్ణారెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి లాంటి నాయకులు ఆయనకు కాలానుగుణంగా కలిసొచ్చారు. ఒక్క వరికుంటపాడు, కొండాపురం మండలాలలో తప్పితే మిగతా ఆరు మండలాల్లో వైసిపికి మెజార్టీ వస్తుందని, ప్రభుత్వ వ్యతిరేకత, జగన్ సానుకూలత ఇంకా బలంగా పనిచేస్తే ఈ రెండు మండలాలలో కూడా వైసిపికే మెజార్టీ వచ్చి భారీ ఆధిక్యం సాధించినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గెలుపుపై సందేహమే లేదంటున్నారు.

● తిరుపతి





## గోవిందుడి దయతో...

## గట్టెక్కేదెవరు?

ఢిల్లీ దేశానికి రాజధాని. అమరావతి రాష్ట్రానికి రాజధాని. తిరుపతి ఆధ్యాత్మిక ప్రపంచపు రాజధాని. తిరుపతి లోక్‌సభ.... నెల్లూరు, చిత్తూరు జిల్లాల సంగమం. ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీలో నాలుగు నెల్లూరుజిల్లా పరిధిలోనివి కాగా, మూడు చిత్తూరు జిల్లా పరిధిలోకి వస్తాయి. కాబట్టే ఈ లోక్‌సభకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ అంతా కూడా నెల్లూరు కేంద్రంగానే జరుగుతుంది. 23వ తేదీ కౌంటింగ్ కూడా నెల్లూరులోనే!

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన తిరుపతి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈసారి ఒక గమ్మత్తయిన విషయముంది. తెలుగుదేశం నుండి పోటీ చేస్తున్న పనబాక లక్ష్మి గాని, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి పోటీ చేస్తున్న బల్లి దుర్గాప్రసాద్‌రావులు కాని అభ్యర్థుల ప్రకటనకు ముందురోజే ఆయా పార్టీల్లో చేరినవాళ్ళు. పనబాక లక్ష్మి రాజకీయ ప్రయాణం 1991లో కాంగ్రెస్‌తోనే మొదలైంది. మొదటిసారి ఇప్పుడు పార్టీ మారి టిడిపిలో చేరి తెలుగుదేశం నుండి ఎంపీ అభ్యర్థి అయ్యింది. బల్లి దుర్గాప్రసాద్ అయితే తెలుగుదేశంలో చంద్రబాబు కంటే సీనియర్. ఆయన కూడా జీవితంలో తొలిసారి పార్టీ మారాడు. వైసిపిలో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి అయ్యాడు. ఇక కాంగ్రెస్ నుండి మాజీఎంపి చింతా మోహన్ పోటీలో వున్నా సోదిలోకి కూడా రాడు. గెలుపు పోరు పనబాక, బల్లిల మధ్యే వుంటుంది.

2014 ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీలకుగాను నాలుగింటిలో వైసిపి గెలిచింది. దానికి తగ్గట్లుగానే ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకుంది. ఈసారి అందుకు భిన్నంగా వుండకపోవచ్చు. ఈ నియోజకవర్గ పరిధిలో క్రాస్ ఓటింగ్‌కు అవకాశం చాలా తక్కువ. ఎందుకంటే అభ్యర్థులిద్దరిదీ సమాన స్థాయి. ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ చేసి చూసే పరిస్థితి లేదు. ఏడింటిలో ఏ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందో ఆ పార్టీయే లోక్‌సభలోనూ జెండా ఎగరేసే అవకాశాలున్నాయి. వైసిపి వాళ్ళు మాత్రం ఏడు అసెంబ్లీ సీట్లలో గెలుస్తామని బలంగా నమ్ముతున్నారు. సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, శ్రీకాళహస్తిలలో సులభంగా గెలుస్తామని, సర్వేపల్లి, తిరుపతి, సత్యవేడులలో గట్టి పోటీ వున్నా కొంత మెజార్టీతోనైనా బయటపడతామనే నమ్మకం ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది.

తెలుగుదేశం నేతల్లో మాత్రం ఆ ధీమా లేదు. వాళ్ళు సర్వేపల్లి, తిరుపతి, సత్యవేడు నియోజకవర్గాలపై మాత్రమే గట్టిగా ఆశలు పెట్టుకుని వున్నారు. ఈ లెక్కన చూస్తే భారీగా క్రాస్ ఓటింగ్ జరిగితే తప్పితే ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం గెలవడం చాలా కష్టం.

● కావలి

## రాజకీయ రణమా...

## వ్యక్తుల సమరమా?

ఈ ఎన్నికలు చాలా వరకు రాజకీయ పార్టీల మధ్య యుద్ధంగానే జరిగాయి. అంతకంటే కూడా మీకు చంద్రబాబు పాలన కావాలా? జగన్ పాలన కావాలా? అని ప్రజలకు ఆప్షన్ ఇచ్చినట్లుగా జరిగాయనుకోవచ్చు. ప్రజలు ఈసారి స్థానిక నాయకులను పెద్దగా పట్టించుకోలేదు. రాష్ట్ర స్థాయిలోనే ఆలోచించారు. చంద్రబాబా? లేదా జగనా? అనే కోణంలో ఆలోచించే ఓట్లేశారు.





అయితే దీనికి కొంచెం భిన్నంగా కావలి నియోజకవర్గంలో ఎన్నికలు జరిగాయనుకోవచ్చు. పార్టీలతో పాటు వ్యక్తుల వ్యక్తిగత సమరానికి కావలి ఈసారి వేదికగా నిలిచింది.

వైసిపిలో వున్నప్పుడు కావలి టిక్కెట్‌ను రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి ఇవ్వొద్దంటూ మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆగిత్యం చేయడం, పార్టీ మాత్రం సిటింగ్ ఎమ్మెల్యేగా ప్రతాప్‌కే సీటివ్వడం జరిగిపోయాయి. దీంతో విష్ణు వైసిపి నుండి బయటకు రావడం, తెలుగుదేశంలో చేరి కావలి నుండి ఆ పార్టీ అభ్యర్థి కావడం జరిగిపోయాయి.

కావలి తెలుగుదేశంకు అటు బీద బ్రదర్స్... ఇటు విష్ణు ఇద్దరూ బలమైన వర్గ నాయకులే! ముఖ్యంగా అల్లూరు మండలంపై పూర్తి ఆధిపత్యం ఈ రెండు వర్గాలదే! బీద మస్తాన్‌రావు నెల్లూరు ఎంపీగా పోటీ చేయడం, ఈ మండలంలో సాధ్యమైనంత ఎక్కువ మెజార్టీలాగాలనుకుని ఆ దిశగా ప్రయత్నాలు చేయడం జరిగింది. అల్లూరు మండలంలో భారీ మెజార్టీ వస్తుందని తెలుగుదేశం నాయకులు అంచనాలు వేసుకుని వున్నారు. దీంతో పాటు దగదర్తి, బోగోలు మండలాలలోనూ తమకు మెజార్టీ వస్తుందని, కావలి పట్టణం, రూరల్‌లో వైసిపికి మెజార్టీ వచ్చినా ఈ మూడు మండలాల మెజార్టీతో పోటీ పడలేదని తెలుగుదేశం వారి ధీమా! అయితే ఇక్కడ ఇంకో లాజిక్ వుంది. బీద మస్తాన్‌రావుకు పడిన ప్రతి ఓటు విష్ణుకు పడలేదని, కాబట్టి అసెంబ్లీపై అంత ఆశాజనక వాతావరణం లేదని పార్టీలోనే కొందరి నేతల అభిప్రాయం.

వైసిపి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ వర్గ నాయకుడు కాదు. ఆయన వెనుక బలమైన వర్గాలేమీ లేవు. కేవలం జగన్ గాలి, తన ఆర్థిక శక్తిని నమ్ముకుని ఎలక్షన్ చేశాడు. కావలి పట్టణం, రూరల్ మండలంలో భారీ మెజార్టీపై ఆశలు పెట్టుకుని వున్నాడు. దగదర్తి, బోగోలు మండలాలలో కొంతైనా తనకే మెజార్టీ వస్తుందని, అల్లూరు మండలంలో టీడీపీ నాయకులు ఆశిస్తున్న భారీ మెజార్టీలేమీ వుండవని, ప్రతిచోటా జగన్ సానుకూల ఓటింగ్ జరిగిందని, కాబట్టి వైసిపికి గెలుపు అవకాశాలెక్కువున్నాయని ఆ పార్టీ నాయకులు ధీమాగా వున్నారు!

● ఆత్మకూరు

## గెలుపుపై...

## ఇరువురిలోనూ ధీమా

ప్రభుత్వ వ్యతిరేకత పార్టీ గాలి, జగన్‌కు ఒక్క ఛాన్స్, పసుపు కుంకుమ... ఇవన్నీ తీసి పక్కనపెడదాం.. ఆత్మకూరు నియోజకవర్గంలో ఎలక్షన్ అన్నది బొల్లినేని కృష్ణయ్య - మేకపాటి గౌతమ్‌రెడ్డిల మధ్య వ్యక్తిగత పోరాటమే అయితే గెలుపు అన్నది బొల్లినేని కృష్ణయ్యకు నల్లేరుపై నడకలాంటిదే! ఆత్మకూరులో ఈసారి అంత బాగా ఎలక్షన్ చేసుకున్నాడు కృష్ణయ్య. ఆ కులం ఈ కులం అనే తేడా లేకుండా అందర్నీ బ్రతిమలాడుకున్నాడు. అందరి ఇళ్ళకు ఒకటికి నాలుగుసార్లు తిరిగి సాయం చేయమని కోరాడు. డబ్బులు ధారాళంగానే ఖర్చుపెట్టాడు. ఎన్నికల మూడునెలల ముందే నియోజకవర్గంలో తిరిగాడు. ఫోన్‌లలో అందర్నీ పలుకరించాడు. ఇంత చేసి ఇంత ఖర్చు పెట్టాక... అదీ కూడా ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో ఫ్లాప్ అయ్యాక బొల్లినేని కృష్ణయ్యకు గెలుపు అవకాశాలు ఎక్కువ వుండాలి. కాని, ఇంత చేసినాక కూడా ఆత్మకూరులో గెలుపుపై బొల్లినేని కృష్ణయయ్యలోనూ కొంత అనుమానముంది. వైసిపికి చాలా గట్టి నియోజకవర్గం ఆత్మకూరు. రెడ్డి సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువ. అలాగే ముస్లింలు ఎక్కువే! 2014లోనే 33వేల మెజార్టీతో వైసిపి గెలిచింది. దీనికితోడు బలమైన వర్గంగల ఆనం రామనారాయణరెడ్డి కూడా వైసిపిలో వున్నాడు. కాబట్టి అంతటి మెజార్టీని తగ్గించి గెలుపు బాటలోకి రావడం అన్నది అసాధ్యమే. అయినా దాని కోసం కృష్ణయ్య పోరాడాడు. ఎంత జగన్ సానుకూలత వున్నా ఆత్మకూరు నుండి కొద్ది మెజార్టీతోనైనా బయటపడతామనే ధీమా తెలుగుదేశం నాయకుల్లో కనిపిస్తుంది. చేజర్ల, సంగం, ఏఎస్‌పేట, ఆత్మకూరు మండలాల మీద టీడీపీ వాళ్ళు భారీ ఆశలు పెట్టుకుని వున్నారు. మర్రిపాడు, అనంతసాగరం మండలాలలో వైసిపికి కొద్ది మెజార్టీ వస్తుందని, పై మండలాలలో భారీ మెజార్టీలతో వైసిపి మెజార్టీని అధిగమించి గెలుస్తామన్నది టీడీపీ నాయకుల నమ్మకం.





జిల్లా వైసిపి అభ్యర్థులలో అత్యంత ఛండాలంగా ఎలక్షన్ చేసింది మేకపాటి గౌతమ్‌రెడ్డి. నాయకులను పట్టించుకోలేదు. చాలా గ్రామాలకు ప్రచారానికి కూడా పోలేదు. ఆర్థికంగానూ వెనుకబడ్డాడు. వైసిపి నాయకులు, కార్యకర్తలలోనే ఆయనపై తీవ్ర అసంతృప్తి వుంది. ఇన్ని లోపాలున్నా కూడా గెలుపుపై ధీమాగా వున్నారు. ఈ ధీమాకు కారణం జగన్ గాలి. జగన్ గాలిలో వైసిపి గెలుస్తుందనే నమ్మకం ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.

# నెల్లూరు కబుర్లు

## జయం మనదేరా...

### టీడీపీ నేతలకు ధైర్యం నూరిపోసిన చంద్రబాబు

ఈ ఎన్నికల్లో పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు 22వ తేదీ అమరావతిలో సమావేశం నిర్వహించారు. నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి బీద మస్తాన్‌రావు తన కుటుంబంలో వున్న ఓ శుభకార్యం వల్ల ఆ సమావేశానికి వెళ్ళలేదు. మిగతా అభ్యర్థులందరూ హాజరయ్యారు. చంద్రబాబు అభ్యర్థులందరికీ ధైర్యం నూరిపోశారు. ఎన్నికల్లో మనమే గెలవబోతున్నామని చెప్పారు. నేను పని చేసినట్లుగా, నేను తపనపడినట్లుగా మీలో కొందరు పనిచేయలేకపోయారని అభ్యర్థులను దెప్పి పొడిచారు. 'పసుపు-కుంకుమ' తెలుగుదేశం పార్టీకి ప్రాణం పోసిందని, మహిళల ఓట్లతో మనం గెలవబోతున్నామని అందరిలో ఆత్మవిశ్వాసం పెంచారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

------------- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



చెక్కును పంపిణీ చేస్తున్న ఎస్పీ ఐశ్వర్య రస్తోగి


విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలవారికి అండగా ఉంటామని, వారిని అన్నివిధాలా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ ఐశ్వర్యరస్తోగి అన్నారు. విధినిర్వహణలో అసువులుబాసిన పలు పోలీసు కుటుంబాలవారికి ఈ నెల 22న తన కార్యాలయంలో హ్యూమానిటీ కార్పస్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కానిస్టేబుల్ రాజారామ్ సతీమణి విద్యుల్లతకు, ఏఆర్‌హెచ్‌సి రంగయ్య సతీమణి సత్యనారాయణమ్మ, కానిస్టేబుల్ అనిల్ సతీమణి మునెమ్మకు, ఏఆర్‌హెచ్‌సి అలెగ్జాండర్ సతీమణి ఉషకు 50 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి. పరమేశ్వర్‌రెడ్డి, ఏ.ఆర్ అడిషనల్ ఎస్పీ వీరభద్రుడు, ఆర్‌ఐ (వెల్ఫేర్) చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి ఆలీం బాషా

అనారోగ్య కారణంగా విశ్రాంతి కోసం ఇటీవల సెలవులో వున్న నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా 22వ తేదీ తిరిగి విధుల్లోకి వచ్చారు. సోమవారం తన ఛాంబర్‌లో కూర్చుని ప్రజల నుండి అర్జీలు కూడా తీసుకున్నారు. ఆలీం భాయ్... అసలే ఎండలు మండుతున్నాయ్... జర జాగ్రత్త!

## సెలవుల పండుగ!

ఈ నెల 24వ తేదీ నుండి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. 22వ తేదీతో అన్ని తరగతులకు సంబంధించి వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. 23వ తేదీ కూడా కొన్ని తరగతుల విద్యార్థులకు స్కూళ్ళు తెరిచారు. 24వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు సెలవులిచ్చారు. జూన్ 12న తిరిగి పాఠశాలలు తెరచుకోనున్నాయి. దాదాపు 50రోజుల పాటు విద్యార్థులు సెలవులతో గడపనున్నారు.



● పగలు మంటలు

## సాయంత్రమైతే కూల్

నెల్లూరు నగరంలో వాతావరణం పగలు వేడిగానూ, రాత్రి చల్లగానూ వుంటోంది. పగలు ఎండ మిడిమేలంగా కాస్తుంది. సాయంత్రమైతే ఆకాశం మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులతో చల్లటి గాలులతో ఆహ్లాదంగా వుంటోంది. ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనానికి సాయంత్రం చల్లటి వాతావరణం ఉపశమనంగా ఉంటోంది.

## నెల్లూరులో శాంతి ర్యాలీ




కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సమాఖ్య సభ్యులు

ఈస్టర్ పండుగనాడు శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన ఉగ్రదాడులను నిరసిస్తూ 22వ తేదీన నెల్లూరులో క్రైస్తవ సమాఖ్య వేదిక శాంతి ర్యాలీ నిర్వహించింది. క్రైస్తవులు నల్ల బ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులు చేతపట్టి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విఆర్ హైస్కూల్ నుండి వైఎంసిఏ గ్రౌండ్ వద్ద గల జీసెస్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మల శాంతి కోసం ప్రార్థనలు చేశారు. క్రైస్తవ మైనార్టీలకు, చర్చిలకు భద్రత కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో క్రైస్తవ సమాఖ్య వేదిక ఛైర్మన్ డేవిడ్ దయాసాగర్, అధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు, పాస్టర్ రాజశేఖర్, జోసెఫ్, ఇందిర సామ్రాజ్యం, శారద తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్

ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నెల్లూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి, దీనికి 1800 4256488 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని గ్రామాలలో ఎక్కడ తాగునీటి సమస్య ఏర్పడినా ఈ నెంబర్‌కు కాల్ చేసి చెప్పొచ్చు. ఫిర్యాదు వచ్చిన 24గంటల్లోగా సమస్య పరిష్కరిస్తా మని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హామీ ఇచ్చారు. గ్రామాల్లో అత్యవసరంగా ఎక్కడ తాగునీటి ఇబ్బం దులు తలెత్తినా వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

## ఎంసెట్ పరీక్షలు ప్రశాంతం

నెల్లూరు జిల్లాలో ఈనెల 20న ఇంజినీరింగ్, వెటర్నరీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఎంసెట్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు కేంద్రాలు, వెంకటేశ్వర, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలు, గూడూరులోని నారాయణ, ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలు, కావలిలోని విశ్వోదయ, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్షను నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో మొత్తం 3091 మందికిగాను 2947 మంది హాజరయ్యారు.

బాబు జీవితం..

# తెలుగుజాతికి అంకితం

● టీడీపీ ఆఫీసులో చంద్రబాబు జన్మదిన వేడుకలు



బాబు బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్సీ బీద, నుడా శీనయ్య, అజీజ్, ముంగమూరు

ఈ నెల 20వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 69వ జన్మదినోత్సవాన్ని నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంతో వేడుకగా జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఖాజా వలి, చాట్ల నరసింహారావు, ధర్మవరం సుబ్బారావు, పొత్తూరు శైలజ, ముప్పాళ్ళ విజేత, అంచూరు జానకి, బి.మనోహర్‌రెడ్డి, బొల్లినేని శ్రీవిద్య పాల్గొన్నారు. బీద రవిచంద్ర కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ చంద్రబాబు తన జీవితాన్ని పేద ప్రజల బాగుకోసం, తెలుగుజాతి ఔన్నత్యం కోసం అంకితం చేశాడని కొనియాడారు. తన అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో అగ్రభాగాన నిలిపిన అనుభవశాలిగా, పరిపాలనాదక్షుడిగా ఆయన చంద్రబాబును అభివర్ణించాడు.

అలాగే, నెల్లూరులోని పెద్దాసుపత్రిలో కూడా బాబు జన్మదిన వేడుకలు బాగానే జరిపారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పెద్దాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావులు పాల్గొని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

## గ్రంథాలయాల్లో...

## వేసవి శిక్షణా తరగతులు

జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో ఈ నెల 25 నుండి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు మొదలుపెట్టారు. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిపుణులైన అధ్యాపకులచే తరగతులు నిర్వహిస్తున్నారు. పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, చెప్పించడం, రాయడం, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక వారి సహకారంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఎన్నికలు



ఈ నెల 21వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని ఏఎల్‌రావు కళ్యాణ మండపంలో లయన్స్ డిస్ట్రిక్ట్ 316జె ఎన్నికలు మరియు వార్షిక సమావేశం జరిగింది. లయన్స్ గవర్నర్ ఏవిఆర్ ప్రసాద్‌తో పాటు అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరులోని 43 లయన్స్ క్లబ్‌ల నుండి 450 మంది సభ్యులు ఈ సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా కిషోర్ కుమార్, వైస్‌డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా రమేష్‌నాథ్‌రెడ్డి, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2గా శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్‌లను నూరుశాతం 'ఎస్' ఓట్లతో ఎన్నుకున్నారు. అలాగే 2019-20 సంవత్సరానికి లయన్స్ జిల్లా 316జెకు క్యాబినెట్ సెక్రటరీగా బయ్యా శ్రీనివాసులును, అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీగా పచ్చిపులుసు శ్రీరాములును, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్‌గా మోహన్‌రావును, అడిషనల్ క్యాబినెట్ ట్రెజరర్‌గా ఆంజనేయులను ఎన్నుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త భార్గవరామ్, లయన్ చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రిచ్‌లో పురిటి బిడ్డకు అరుదైన శస్త్ర చికిత్స



వివరాలను వెల్లడిస్తున్న రిచ్ వైద్య బృందం

పుట్టుకతోనే అన్నవాహిక లోపాలతో జన్మించిన పురిటి బిడ్డకు అరుదైన శస్త్ర చికిత్సను రిచ్ చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఈనెల 22 న నెల్లూరు పొగతోటలోని రిచ్ ఆసుపత్రి సెమినార్‌హాల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ టి. రవికుమార్ మాట్లాడుతూ కడప జిల్లా అట్లూరు మండలానికి చెందిన విజయలక్ష్మి, నాగరాజు దంపతులకు ఈనెల 8న జన్మించిన బిడ్డను పూర్తిగా నీలం రంగులో, పాలు తాగలేకుండా, తీవ్రమైన ఆయాసంతో ప్రమాదకరస్థితిలో తమ హాస్పిటల్‌కు తీసుకువచ్చారన్నారు. ఆ బిడ్డకు అవసరమైన చికిత్సలు నిర్వహించి అన్నవాహిక లేకపోవడాన్ని గుర్తించి వెంటనే ఆ బిడ్డకు న్యూబోర్న్ సెల్ యూనిట్‌లో ఉంచి ట్రెకో-ఇసోఫెజిఎల్-ఫిస్టులా (టిఓఎఫ్) శస్త్ర చికిత్సను ప్రముఖ చిన్న పిల్లల శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ పవన్‌కుమార్ విజయవంతంగా నిర్వహించారన్నారు. అదేవిధంగా నియోనేటల్ ఇన్‌టెన్సివ్ కేర్ వైద్యులు డాక్టర్ హజరత్, డాక్టర్ నజీర్, డాక్టర్ రాహుల్‌లు సహకారమందించారన్నారు. ఎంతో ఖరీదైన శస్త్ర చికిత్సను ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం బిడ్డ ఆరోగ్యం బాగుందని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# తీరంలో... కలవరం



## • శ్రీలంక ఘటనతో అప్రమత్తం

**శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన ఉగ్రదాడులతో నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో కూడా కలవరం మొదలైంది. జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతంలో నిఘాను పెంచింది.**

శ్రీలంకకు మన తీర ప్రాంతం చాలా దగ్గర. శ్రీలంకలో ఉగ్రదాడులకు పాల్పడిన నిందితులు సముద్ర మార్గం ద్వారా తప్పించుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఈ నేపథ్యంలో వారికి దగ్గరిదారి తమిళనాడు, ఆంధ్రా తీరప్రాంతాలే! గతంలో సముద్ర మార్గం ద్వారా వచ్చిన ఉగ్రవాదులు ముంబై మారణకాండకు పాల్పడడం తెలిసిందే! ఈ ఘటనను దృష్టిలో పెట్టుకునే ఎక్కడ ఉగ్రదాడులు జరిగినా నెల్లూరుజిల్లాలోని తీరప్రాంతాలను కూడా అలర్ట్ చేస్తుంటారు.

కొలంబోదాడుల నేపథ్యంలో జిల్లాలోని తీరప్రాంత మండలాల పోలీసుస్టేషన్‌లను అప్రమత్తం చేశారు. జిల్లాలో తడ, సూళ్లూరుపేట, డి.వి.సత్రం, ముత్తుకూరు, ఇందుకూరుపేట, కృష్ణపట్నం, కోట, వాకాడు, విడవలూరు, అల్లూరు, కావలి రూరల్ సముద్రతీర మండలాల పోలీస్‌స్టేషన్‌లు, వీటితో పాటు ఇస్కపల్లి, దుగరాజపట్నం, శ్రీహరికోటలో మెరైన్ స్టేషన్‌లు వున్నాయి. వీటి సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తుంటారు. ఉగ్రదాడులు జరిగిన తర్వాత మెరైన్ సిబ్బందిని అలర్ట్ చేశారు.

జిల్లాలోని తీరప్రాంతంలో శ్రీహరికోట షార్‌సెంటర్‌తో పాటు, కృష్ణపట్నం పోర్టు కీలకంగా వున్నాయి. ఈ రెండింటికి భద్రతను పెంచారు. తీరంలో కన్నార్పకుండా గస్తీ కాస్తున్నారు.

### క్యాన్సర్ ఆసుపత్రిలో...

# ఆదాల రాఘవరెడ్డి స్మారక లేబొరేటరీ ప్రారంభం

నెల్లూరు, పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో స్వర్గీయ ఆదాల రాఘవరెడ్డి స్మారకంగా ఆయన కుటుంబసభ్యులు అందజేసిన 20లక్షల విరాళాలతో నిర్మించిన అధునాతన ఆదాల రాఘవరెడ్డి లేబొరేటరీ భవనాన్ని ఇటీవల జనహిత–వాత్సల్య అనాథాశ్రమం గౌరవాధ్యక్షులు సామంతు గోపాలరెడ్డి ప్రారంభించారు. రెడ్డీ ల్యాబ్స్ అధినేత జి.వి.ప్రసాద్ తన వ్యక్తిగతంగా 25లక్షలు, సంస్థ తరపున మరో 25లక్షలు మొత్తం 50లక్షలు లేబొరేటరీలో వైద్యపరికరాల కొనుగోలుకు విరాళంగా అందజేయగా, క్యాన్సర్ ఆసుపత్రి నుండి మరో 10లక్షలు జోడించి మొత్తం 60లక్షలతో లేబరేటరీ పరికరాలను కొనుగోలు చేసి క్యాన్సర్ సేవల కోసం అమర్చారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఈ లేబరోటరీ ఎంతగానో సేవలందించనుంది. ఈ లేబొరేటరీ ప్రారంభోత్సవంలో ఈ ఆసుపత్రి ఫౌండర్ దాత జె.యస్.రెడ్డి, మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి, మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, పల్లిపాడు పినాకిని ఆశ్రమం నిర్వాహకులు గణేశం కృష్ణారెడ్డి, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎం.మోహన్‌లాల్‌జైన్, క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, లేబొరేటరీ భవన దాతలు ఆదాల మురళీకృష్ణారెడ్డి, ఆదాల వంశీకృష్ణారెడ్డిలను ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు సత్కరించి వారి దాతృత్వాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆదాల మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ పదేళ్ళ క్రితం తాను ఈ ఆసుపత్రిని సందర్శించానని, అప్పటికీ ఇప్పటికీ ఈ ఆసుపత్రి ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సేవలో తమకు భాగస్వామ్యం కల్పించినందుకు ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



లేబొరేటరీని ప్రారంభిస్తున్న సామంతు గోపాలరెడ్డి

# ఆంధ్రులను అప్పుల్లో ముంచిన బాబు

**- ఆనం రామనారాయణరెడ్డి**




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

కడుపులో పెరుగుతున్న బిడ్డతో సహా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనిషికి లక్షా10వేల రూపాయల అప్పును గిఫ్ట్‌గా ఇచ్చాడని మాజీమంత్రి, వైసిపి నాయకుడు ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించాడు. 22వ తేదీ నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాడు. ఈ ఐదేళ్ళలో చంద్రబాబు లెక్కకుమించి అప్పులు తెచ్చారు, తెచ్చిన అప్పులను తెలుగుదేశం నాయకులు దోచుకున్నారు. ఈ ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన దోపిడీ, దుబారాపై జాతీయ దర్యాప్తు సంస్థల చేత విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి వర్గం తీసుకునే నిర్ణయాలలో లోపాలుంటే ఎత్తిచూపే అధికారం, సమీక్షించే అవకాశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వుంటుందని, మంత్రివర్గం తీసుకునే నిర్ణయాలకు మేం బాధ్యత వహిస్తామని చెప్పే ధైర్యం చంద్రబాబుకు గాని, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడికి గాని ఉందా అని ఆయన ప్రశ్నించాడు. రాష్ట్రంలో అధికారయంత్రాంగాన్ని గాడిన పెట్టాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల కోడ్ వున్న సమయంలో 1381 కేజీల టిటిడి బంగారాన్ని భద్రత లేకుండా ఎలా తరలిస్తారని, ఎక్కడకు తరలిస్తున్నారని, దీనిపై సిఎస్ ఎల్వి సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకుని విచారణ జరిపించాలని కోరాడు. ఈ నెలలో ఒకేరోజు 5వేల కోట్లు ఎందుకు డ్రా చేయాల్సి వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నాడు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో మే 1 నుంచి 8వ తేదివరకు నిర్వహించనున్న ఇంటర్‌మీడియట్, 10వ తరగతి పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని, ఎలాంటి మాస్‌కాపీయింగ్ లేకుండా పరీక్షలు పకడ్బందీగా జరపాలని, ఏదైనా అవకతవకలు జరిగితే సంబంధిత ఛీఫ్ సూపరింటెండెంట్‌లపై క్రమశిక్షణా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను హెచ్చరించారు. ఈ నెల 22న తన క్యాంప్ కార్యాలయంలో ఓపెన్‌స్కూల్ పరీక్షలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ పరీక్షలకు మొత్తం 5080మంది విద్యార్థులు హాజరవుతున్నారని, అందులో 2,700మందికి పైగా రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మే 9 నుంచి 13వ తేది వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి 9 మంది ఛీఫ్ సూపరింటెండెంట్‌లను, 10వ తరగతికి సంబంధించి 8 మంది ఛీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించడం జరిగిందని, 3 ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లను కూడా నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్, జిల్లా ఒకేషనల్ ఆఫీసర్ బి.వెంకయ్య, ఆర్‌ఐఓ సత్యనారాయణ, డిటిసి శివరాంప్రసాద్, డిఎంఅండ్ హెచ్ఓ వరసుందరం పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

## మంచినీటి ఎద్దడి లేకుండా చూడండి

జిల్లాలో మంచినీటి ఎద్దడిలేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం అయ్యేలా చూడాలని కలెక్టర్ ముత్యాలరాజు ఈనెల 22న జరిగిన అధికారుల సమావేశంలో అన్నారు. మంచినీటి సరఫరాపై సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ముఖ్యంగా ఏఎస్‌పేట, ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో నీటిఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలన్నారు. బండేపల్లి కెనాల్‌కు సంబంధించి ల్యాండ్ అక్విజిషన్ పనులను పూర్తిచేయాలన్నారు. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో, ఎలక్షన్ కోడ్ పూర్తయిన తర్వాత పొందాల్సిన అనుమతులను త్వరితగతిన తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.




## వైభవంగా వింజమూరు

# చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు





వింజమూరులో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీతో ముగిశాయి. ఈ నెల 16వ తేదీన అంకురార్పణతో చెన్నకేశవ స్వామి తిరునాళ్ళు ప్రారంభమయ్యాయి. 17వ తేదీ ధ్వజారోహణం, శేషవాహనోత్సవం, 18వ తేదీ కొత్తూరువాసులచే పొన్న వాహనోత్సవం, 19వ తేదీ పాతూరు వాసులచే హనుమంతుసేవ, 20వ తేదీ నడిమూరు వాసులచే గరుడసేవ, 21వతేదీ యర్రబల్లి పాలెం వాసులచే కళ్యాణోత్సవం జరిగాయి. 22వ తేదీ ఉదయం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ చెన్నకేశవుని రథంపై ప్రతిష్టించి రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం నుండి మొదలైన రథోత్సవం గంగమమిట్ట వరకు సాగి తిరిగి దేవస్థానం వద్దకు చేరుకుంది. దారి పొడవునా రథంపై కొలువుదీరిన స్వామివారిని వేలాదిమంది భక్తులు దర్శించుకుని తరించారు. స్థానికులు, వివిధ సేవా సంస్థలు భక్తులకు మజ్జిగ, శీతల పానీయాలు అందించారు. 23వ తేదీ పారువేట, 24వ తేదీ ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ధర్మకర్తలు గణపం సుదర్శన్‌రెడ్డి, గణపం రమణారెడ్డిలు ప్రతిరోజూ ఉత్సవాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన భక్తులకు, వివిధ శాఖల అధికారులు బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి, బ్రహ్మోత్సవాలకు లైటింగ్, డెకరేషన్ కల్పించిన దాతలు బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్, కృష్ణపట్నం పోర్టు వారికి ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## కమనీయం...

# కోదండరాముడి రథోత్సవం

నెల్లూరు కార్పొరేషన్ 38వ డివిజన్ పరిధిలోని పొట్టేపాళెంలో వున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుండి మొదలై వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా 13వ తేదీ అంకురార్పణ, 14వ తేదీ ధ్వజారోహణ, హంస వాహనం, 15వ తేదీ శేష వాహనం, 16వతేదీ హనుమంత సేవ, 17వ తేదీ సింహ వాహనం, 18వ తేదీ కల్పవృక్ష వాహనం, 19వ తేదీ గరుడ సేవ, 20వతేదీ కళ్యాణోత్సవం జరిగాయి. 21వ తేదీ ఆలయ మాజీఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి, పొన్నాల వెంకటశేషారెడ్డి, పొన్నాల వెంకటరామిరెడ్డిలు ఉభయకర్తలుగా గజవాహనోత్సవం జరిగింది.



రథోత్సవం



గజవాహనోత్సవం

22న రథోత్సవం కనులపండువగా సాగింది. సీతా, రామ, లక్ష్మణులను రథంపై ప్రతిష్టించి జొన్నవాడ రోడ్డు వరకు రథోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారాములను దర్శించి తరించారు. 23వ తేదీ పట్టాభిషేకం, 24వ తేదీ అశ్వ వాహనోత్సవం, 25వ తేదీ ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ఇ.ఓ వేమూరు గోపి ఉత్సవాలను పర్యవేక్షించారు.

# పార్టీల గెలుపుపై పందేల జోరు



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందా? వైకాపా అధికారంలోకి వస్తుందా? జిల్లాలో పది స్థానాల్లో తెలుగుదేశం పార్టీకి ఎన్ని, వైకాపాకు ఎన్ని? గూడూరులో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందా? వైకాపా గెలుస్తుందా? అన్న చర్చ ప్రస్తుతం ఎక్కడ చూసినా వినిపిస్తోంది. దీని ప్రభావంతోనే కొందరు బెట్టింగ్ రాయుళ్ళు జోరుగా పందేలను కట్టారు. ఏ పార్టీ గెలిచినా ఆయా పార్టీ అభ్యర్థులు ఎంత మెజార్టీతో గెలుస్తారోనని పట్టణంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు లక్షల రూపాయల్లో పందేలు కట్టారు. పందెం రాయుళ్ళు జిల్లాలో సర్వేలు చేయించి మరీ పోటా పోటీగా నువ్వానేనా అంటూ పందేలు కట్టినట్లు సమాచారం. మరోవైపు ఆన్‌లైన్ బెట్టింగ్ కూడా జోరందుకుంది. కొందరు విదేశాల్లో ఉన్నవారు జిల్లాలోని పలు ఎమ్మెల్యే స్థానాలపై జోరుగా కోట్లలో పందేలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంక నెలరోజుల్లో ఓట్ల లెక్కింపు ఉండడంతో కొందరు పట్టణంలోని వ్యక్తులు, గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ సరళిపై విచారించి తద్వారా ఓ ఆలోచనతో గతంలో ఎన్నడూ లేనివిధంగా పందెం కడుతున్నారు. మరోవైపు తిరుపతి ఎంపి స్థానాన్ని తెలుగుదేశం పార్టీ, వైకాపా అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారన్న విషయంపై తిరుపతి, కాళహస్తి, సత్యవేడు ప్రాంతాల్లో పరిచయస్తుల ద్వారా సమాచారం సేకరించి గెలుపు పలానా పార్టీదేనని లక్షల రూపాయల్లో పందేలు కడుతున్నారు. మొత్తంమీద ఇరు పార్టీల మధ్య పోటీకి ధీటుగా పందెంరాయుళ్ళు కూడా పోటాపోటీగా ఉన్నారు.

## కృష్ణ మందిరం వద్ద

# చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రవి, డాక్టర్ సి.రోహిణి

గూడూరు పట్టణంలోని కృష్ణ మందిరం వద్ద ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవి ఈనెల 23న ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణిలు మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రయాణీకుల దప్పికను తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి చేస్తున్న సేవలను కమిషనర్ రవి కొనియాడారు. అనంతరం అక్కడున్న వారికి మజ్జిగను, పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, నెమలి కోటేశ్వరరావు, పొదర్తి ప్రసాద్, సుప్రియ, జమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విహారయాత్రలో

# విషాదం

### - బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి మృతి



జాకీర్‌హుస్సేన్

సరదాగా సముద్ర తీరంలో గడపాలని వెళ్ళిన రెండు ఉద్యోగ కుటుంబాలు విహార యాత్రలో విషాదానికి గురయ్యాయి. ఆ కుటుంబాల్లో ఒకరు సముద్రంలోకి దిగి మృత్యువొడికి చేరుకోగా, మరొకరు ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన ఆదివారం తోటపల్లిగూడూరు మండలంలోని కొత్తకోడూరు బీచ్‌లో జరిగింది. గూడూరులోని మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ షేక్ జాకీర్ హుస్సేన్ (బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి) కుటుంబంతో పాటు, స్టేట్‌బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న హేమలత అనే ఉద్యోగిని, ఆమె తల్లిదండ్రులు గూడూరు నుంచి వాహనంలో కొత్తకోడూరు బీచ్‌కు బయలుదేరి వెళ్ళారు. జాకీర్‌హుస్సేన్‌తో పాటు కుటుంబసభ్యులు షాజిదాబేగం, కుమారుడు తేఫిక్‌హుస్సేన్, అదేవిధంగా హేమలత, ఆమె తల్లిదండ్రులు బీచ్‌లో మునుగుతుండగా అలల తాకిడికి జాకీర్‌హుస్సేన్ సముద్రం నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. హేమలత కూడా నీటిలో మునిగిపోయినా, సకాలంలో ఆమెను రక్షించడంతో ఆమె ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# గొంతెండుతున్న చెన్నూరు

### - సబ్‌కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి



సబ్‌కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోరుతూ గూడూరు సబ్ కలెక్టర్ ఆనంద్‌కు సిపిఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. చెన్నూరు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అయినా ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 30వేల మంది ప్రజలున్న మేజర్ పంచాయతీలోనే తాగునీటి కష్టాలు ఇలా ఉంటే, ఇక చిన్న గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుని తాగునీటి సమస్య లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యాదగిరి, శ్రీనివాసులు, వెంకటయ్య, పి.శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాఫా ఐ కేర్ ఆధ్వర్యంలో...

# ఉచిత కంటి వైద్య శిబిరం




కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రూపకళ హిమబిందు

ఈ నెల 23వ తేదీ గూడూరు, నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూలులో రాఫా ఐ కేర్, నెల్లూరు అధినేత డా. రూపకళ హిమబిందు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 250 మంది పిల్లలకు కంటి పరీక్షలు చేసి, చాలామంది పిల్లలకు కంటి సమస్యలు ఉన్నాయని కనుగొన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి తగిన వైద్యం చేయవలసి ఉంటుందని ఆమె తెలిపారు.

శ్రీను గల్పిక

# అమరావతిలో 'దూకుడు' సెట్టింగ్

పాతిక ప్రపంచ మేటి నగరాలు మిక్సీలో వేసి తిప్పి తీసిన అమరావతి నగరం. ఉండవల్లిలోని లింగమనేని గెస్ట్‌హౌస్. ఐటి మంత్రి ఫన్నీ స్టార్ నారా లోకేష్ తన గదిలో దిగాలుగా కూర్చుని వున్నాడు. నారా బ్రాహ్మణి వచ్చి ఆయనతో.. ఏమీ కాదులేండి, మీరు ఎక్కువగా ఆలోచించవద్దు, అన్నీ సర్దుకుంటాయని చెబుతుంది. అప్పుడే అక్కడకు తెలుగుదేశం నాయకులు కళా వెంకట్రావ్, యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతి రాజు, దేవినేని ఉమామహేశ్వరరావు, మాగంటి మురళీమోహన్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డిలు వచ్చారు. బ్రాహ్మణి అన్న మాటలు విని... ఏమైందమ్మా, లోకేష్ ఎందుకు దిగులుగా వున్నాడని సోమిరెడ్డి అడిగాడు. వాళ్ళ నాన్న గురించి ఎక్కువుగా ఆలోచిస్తున్నాడని బ్రాహ్మణి అంది. ఏమి ఆలోచిస్తున్నావని నారాయణ లోకేష్‌ను అడిగాడు. లోకేష్ అప్పుడు... ఏం చెప్పేదంకుల్... నాన్న గారు రోజూ టెన్షన్ పడుతున్నారు. ఎన్నికల్లో గెలుస్తామా? లేదా అని భయపడుతున్నారు. ఆ భయంతోనే ఈసీని తిడుతున్నాడు. ఈవిఎంలను తిడుతున్నాడు. పిలిచినా పిలవకపోయినా అన్ని రాష్ట్రాలు తిరిగి ప్రచారం చేస్తున్నాడు. ఎన్నికల కోడ్‌ను కూడా పట్టించుకోకుండా అధికారులతో మీటింగ్‌లు పెట్టేస్తున్నాడు. అధికారం మీద ఇంత యావ వున్న మనిషి... రేపు పొరపాటున ఎన్నికల్లో ఓడిపోతే ఏమైపోతాడా అనే భయం వేస్తుంది అంకుల్... ఆయన సీఎం కుర్చీ నుండి దిగిపోవాల్సి వస్తే మాత్రం మానసికంగా కుమిలిపోతాడు. మనిషి నలిగిపోతాడు. అదీ నా బాధ అని చెప్పాడు. లోకేష్ ఆ మాటలు చెబుతుండగా అక్కడే వున్న టీవీలోని 'స్టార్ మా' ఛానెల్‌లో 'దూకుడు' సినిమా వస్తుంది. అందులో మహేష్‌బాబు టీమ్, బ్రహ్మానందంల మధ్య జరిగే కామెడీ సన్నివేశాలు వస్తున్నాయి. ఆ సీన్‌లు చూడగానే సోమిరెడ్డి మైండ్ ఫ్లాష్‌లైట్‌లాగా వెలిగింది. వెంటనే ఆయన లోకేష్‌తో... ఆ సంగతి నాకు వదిలేయ్ బాబు, నేను చూసుకుంటాను అని చెప్పాడు. ఎలా చూసుకుంటావో కొంచెం చెప్పండంకుల్ అని లోకేష్ అడిగాడు. చెప్పను స్క్రీన్‌పై చూపిస్తా చూడు అంటూ సోమిరెడ్డి చేతి వేలితో గాల్లో స్క్రీన్ గీసి సీన్ ప్లే చేశాడు. స్క్రీన్‌పై సోమిరెడ్డి వ్యూహాత్మక చిత్రం ప్రసారం కాసాగింది.

★★★★★

***మే23వ తేదీ... ఉదయం 8గంటలు.*** చంద్రబాబు టిఫిన్ తిని హాల్‌లోకి వచ్చి టీవీ ఆన్ చేసి తనకిష్టమైన ఏబిసిడి ఛానెల్ పెట్టుకున్నాడు. వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు ఆయనతో కలిసి ఎన్నికల ఫలితాలను చూడడానికి వచ్చి కూర్చున్నారు. టీవీ స్క్రీన్‌పై "రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన కౌంటింగ్... మరికొద్ది సేపట్లో ఫలితాలు" అంటూ ఫ్లాష్ న్యూస్ రాసాగింది. చంద్రబాబులో టెన్షన్ పెరిగింది.

***8.30 గంటలు...*** పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు... అన్ని స్థానాలలో తెలుగుదేశంకే ఆధిక్యం అంటూ ఫ్లాష్ న్యూస్. దీనిని చూడగానే చంద్రబాబులో కొంత రిలీఫ్...

***9గంటలు...*** ఫలితాలలో తెలుగుదేశం ముందంజ... 27స్థానాలలో తెలుగుదేశం ఆధిక్యం... 10 స్థానాలలో వైసిపి ఆధిక్యం... మంగళగిరిలో లోకేష్ ముందంజ... చంద్రబాబులో తెలియని ఆనందం ... గెలుపుపై ఒక భరోసా.

***9.30 గంటలు...*** 18 పార్లమెంట్ స్థానాలలో తెలుగుదేశం ఆధిక్యం... 6 స్థానాలలో వైసిపి, ఒక స్థానంలో జనసేన ముందంజ... అసెంబ్లీ ఫలితాలలో దూసుకెళ్తున్న తెలుగుదేశం... 110 స్థానాలలో టీడీపీ, 60స్థానాలలో వైసిపి ఆధిక్యం... 5 స్థానాలలో ఇతరులు. టీవీ స్క్రీన్ మీద ఈ ఫ్లాష్ న్యూస్‌ను చూడగానే చంద్రబాబుకు 'తొలిప్రేమ' సినిమాలో పవన్‌కళ్యాణ్‌లాగా పక్క రూమ్‌కు వెళ్ళి డ్యాన్స్ చేయాలనుకున్నాడు. కాని ఈ వయసులో ఆ సాహసం చేస్తే బాగుండదనుకుని సరిపెట్టుకున్నాడు.

***10గంటలు...*** కేంద్రంలో ప్రాంతీయ పార్టీల హవా... మెజార్టీ సాధించలేకపోయిన ఎన్డీఏ.. కాంగ్రెస్ మద్దతుతో తృతీయ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం. ప్రధానిగా చంద్రబాబుకు అన్ని పక్షాల నాయకుల మద్దతు. ఈ బ్రేకింగ్ న్యూస్‌ను చూడగానే చంద్రబాబు సంభ్రమాశ్చర్యాలకు గురై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే కళా వెంకట్రావ్ ఆయన ముఖం మీద నీళ్ళు చల్లి లేపాడు. చంద్రబాబు తేరుకుని... వెంకట్రావ్ నా కసి తీరబోతుంది. నా కల నెరవేరబోతుంది. నేను ప్రధాని అయిన వెంటనే ఆ నరేంద్ర మోడీని, జగన్‌ను జైలులోకి పంపిస్తాను అని ఆనందంగా చెప్పసాగాడు.

***11గంటలు...*** పూర్తి కావచ్చిన కౌంటింగ్... 112 స్థానాలలో విజయం ఖాయం చేసుకున్న తెలుగుదేశం. 19ఎంపీ స్థానాల్లో దేశంలోనే ఐదో పెద్ద పార్టీగా తెలుగుదేశం. ప్రధానిగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశం... ఏపి ముఖ్యమంత్రిగా యువ కీర్తికిషోర శిఖర నారా లోకేష్‌కు పట్టాభిషేకం. ఈ ఫ్లాష్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతూ ఇంటర్వ్యూలిస్తున్నారు. మొదట దేవేగౌడ... ఈరోజు దేశంలో బీజేపీ ఓడిపోయిందంటే దానికి ప్రధాన కారణం చంద్రబాబే! ఆయన అన్ని రాష్ట్రాలలో తిరిగి ప్రచారం చేయబట్టే బీజేపీయేతర పార్టీలకు మెజార్టీ సీట్లు వచ్చాయి. ఆయన కన్నడంలో చేసిన ఉపన్యాసం విని... కన్నడిగులంతా మా పార్టీకి ఓట్లేశారు. మెజార్టీ సీట్లు ఇచ్చారు. దీనికి కృతజ్ఞతగానే ప్రధానిగా ఆయనకు మద్దతునిస్తున్నాను అని చెప్పాడు.

తర్వాత స్టాలిన్ మాట్లాడుతూ మాకు తమిళనాడులో మెజార్టీ సీట్లు రావడానికి చంద్రబాబు పాత్ర ఎంతో వుంది. ఆయన 'ఆరు గంటల్లో తమిళం' అనే పుస్తకాన్ని చదివి తమిళంలో చేసిన ప్రసంగాలకు మా తమిళ ప్రజలు ఆకర్షితులయ్యారు. మా పార్టీకి మెజార్టీ సీట్లు ఇచ్చారు. ప్రధానిగా చంద్రబాబుకే మా మద్దతు అని చెప్పాడు.

మమతా బెనర్జీ మాట్లాడుతూ... ప్రధానిగా నాకంటే చంద్రబాబే సమర్థుడు... ఈసారికి ఆయనకే అవకాశం ఇవ్వాలనుకుంటున్నాం అని చెప్పింది.

ఇక రాహుల్ మాట్లాడుతూ బీజేపీని నిలువరించాలన్న మా కోరిక నెరవేరింది. ఇందులో ఎక్కువ శ్రమ పడింది చంద్రబాబునాయుడు గారే. కాబట్టి ఆయన అనుభవానికి పెద్దపీట వేస్తూ ప్రధానిగా ఆయనకే కాంగ్రెస్‌పార్టీ పూర్తి మద్దతునిస్తోందని చెప్పాడు.

***మధ్యాహ్నం ఒంటి గంట...*** ఫలితాలు పూర్తిగా వచ్చేశాయి. రాష్ట్రంలో తెలుగుదేశం శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. ఏ ఊర్లో చూసినా లోకేష్ సీఎం అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు. కొందరు యువకులైతే... ఆంధ్రభోజుడు నారా లోకేష్‌ను సీఎంను చేయకపోతే మేం ఆత్మహత్యలు చేసుకుంటాం... అని వార్నింగ్‌లు ఇస్తున్నారు. టీవీలో అది చూస్తున్న నారాయణకు ఏదో డౌట్ వచ్చి ఆంధ్రభోజుడు అంటే ఏంటి సార్ అని చంద్రబాబును అడిగాడు. పక్కనే వున్న ఎమ్మెల్సీ యలమంచిలి రాజేంద్రప్రసాద్... అయ్యవారా నీకు అది కూడా తెలియదా..? చదువుల మీద ఇన్ని వేల కోట్లు ఎలా సంపాదించావయ్యా... ఆంధ్రా మెస్‌లో భోజనం చేసేవాడిని ఆంధ్రభోజుడు అంటారు అని చెప్పాడు.

**(ఇంకా వుంది...)**

# శ్రీరామ చరితం.. ఆదర్శప్రాయం

**- విద్వాన్ కోట రాజశేఖర్**



రామాయణ ప్రాశస్త్యాన్ని గురించి ఉపన్యసిస్తున్న అవధాని కోట రాజశేఖర్

సకల సద్గుణశోభితుడైన శ్రీరామ చంద్రుని చరితం మానవాళికి ఆదర్శప్రాయమని విద్వాన్ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. శ్రీరామనవమి పర్వదినాలను పురస్కరించుకుని నెల్లూరు వేదాయపాళెంలోని మహాత్మాగాంధీ నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ఈనెల 14 నుంచి 20వ తేది వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీమద్రామాయణ సప్తాహం జరిగింది. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మికోపన్యాసాల్లో భాగంగా ఈనెల 20న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామాయణం లోకపూజితమని, సీతారాముల చరిత్ర జగద్విదితమని అన్నారు. ఈ సప్తాహంలో భాగంగా తొలిరోజున 'శ్రీరామనవమి' ప్రాముఖ్యత గురించి కోట రాజశేఖర్ వివరించగా, 15న 'ధర్మస్వరూపుడు శ్రీరామచంద్రమూర్తి' అనే అంశంపై బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, 16న 'సీతాదేవి చరిత్ర' అంశంపై శ్రీమతి ఎస్. వసుంధరాదేవి, 17న 'శ్రీమద్రామాయణం-సేవాధర్మం' అనే అంశంపై తుర్లపాటి లక్ష్మీనారాయణరావు, 18న 'ఇంటింటి రామాయణం' అనే అంశంపై డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, 19న 'శ్రీరామరాజ్యం' అంశంపై పోలవరపు లక్ష్మీనరసింహారావు ఉపన్యసించారు. ఏడవరోజున 'రామాయణం-జాతికి సందేశము' అనే అంశంపై కోట రాజశేఖర్ ఉపన్యసించారు. శ్రీరాముడు ధర్మస్వరూపుడని, మానవరూపంలో అవతరించిన మాధవుడని, శ్రీరాముని చరితం అందరికీ మార్గదర్శకమని ఈ సందర్భంగా వక్తలు శ్రీమద్రామాయణం వైశిష్ట్యాన్ని అత్యద్భుతంగా వివరించారు. ఏడురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మికోపన్యాసాలను ఆసాంతం విన్నారు. ఉపన్యాసాల అనంతరం వక్తలను మందిరం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మందిరం ధర్మకర్త సిహెచ్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్. సుబ్బరామరాజు, ఉపాధ్యక్షులు వేణుబాబు, కార్యనిర్వాహకుడు కొమరా మాలకొండయ్య, కోశాధికారి వి.శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి ఎన్.రజనీకాంతమ్మతో పాటు ఎం.విమలమ్మ, అరుణమ్మ, మహేశ్వరి, పి.భానుమతి, శైలజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వవిద్యాలయాల అభివృద్ధికి

# విద్యార్థుల సహకారం అవసరం

నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ 11 వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 20న జరిగాయి. ఈ కార్యక్రమంలో వియస్ యూ వైస్ ఛాన్సలర్ సుదర్శనరావు పాల్గొని మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల అభివృద్ధికి విద్యార్థుల భాగస్వామ్యం అవసరమని, అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు రావాలంటే తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వియస్‌యూలో పొందిన నైపుణ్యాలతో పాటు, కమ్యూనికేషన్, కంప్యూటర్ ప్రోగ్రామ్ కోర్సులపై అవగాహన పెంచుకుంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కొత్త షార్ట్ టర్మ్ కోర్సులను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనుపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ అందె ప్రసాద్, సిడీసీ డీన్ విజయానంద్ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


## వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

**ఆర్.ఓ.సి.నెం.02/2019** **తేది.23.04.2019**

### టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయితీకి 2019-2020వ ఆర్థిక సంవత్సరమునకు ఈ క్రింద కనుపరిచిన వస్తువులు దఫాలు వారీగా సరఫరా చేయుటకు మరియు పి.డబ్ల్యూ.యస్ స్కీములకు సంబంధించిన మోటార్లు, పంపులు మరియు ఇతరములు మరమ్మత్తులు చేయుటకు తే.06.05.2019ది సోమవారము ఉదయం 11గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు సాయంత్రం 4గంటలకు హాజరయిన టెండరుదార్లు సమక్షములో టెండర్లు తెరవబడును. ఇతర వివరములు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.సం. | వివరములు | ధరావత్తు రుసుము |
|---|---|---|
| 1. | 2019-2020వ సం॥నకు పి.డబ్ల్యూ.యస్. సామానుల విడిభాగములు దఫాలు వారీగా సరఫరా | రూ.1000/-లు |
| 2. | 2019-2020వ సం॥నకు బ్లీచింగు, సున్నము, ఫినాయిలు, మరియు ఇతర క్రిమి సంహారక మందుల సరఫరా | రూ.1000/-లు |
| 3. | 2019-2020వ సం॥నకు అవసరమగు ఎల్.ఎఫ్ బుక్స్ & ఫారముల సరఫరా చేయుట | రూ.500/-లు |
| 4. | 2019-2020వ సం॥నకు అవసరమగు పారిశుద్ధ్య సామానులు అనగా చీపుర్లు, కాలువ పారలు, బ్రషులు, చెలగపారలు వగైరాలు సరఫరా చేయుట | రూ.500/-లు |
| 5. | 2019-2020వ సం॥నకు పి.డబ్ల్యూ.యస్ స్కీమునకు చెందిన మోటార్లు, పంపులు, స్టార్టర్లు మరియు ఇతరములు మరమ్మత్తులు చేయుటకు | రూ. 500/-లు |

గమనిక : ఎ) టెండర్లునకు సంబంధించిన షెడ్యూలు ఫారములు ముందుగా ఫారము ఒకటి రూ.50/-లు చెల్లించి గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పొందవలయును.
బి) టెండర్లు నిర్వహించు తేదీని ప్రభుత్వము వారు అనివార్య కారణముల వలన సెలవు దినముగా ప్రకటించినచో మరుసటి రోజు టెండర్లు నిర్వహించబడును.
సి) టెండర్లు పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దు పరుచుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

**సం/- కె.రామారావు**
**పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి**
**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

# అలరించిన రత్నం
# 'థియేటర్ అండ్ ఆర్ట్స్ క్లబ్'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రేస్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల అధినేత డా. కె.కృష్ణకిషోర్

నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రేస్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల అధినేతలు డా. కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు థియేటర్ అండ్ ఆర్ట్స్‌క్లబ్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 23న నెల్లూరు కస్తూరిభా కళాక్షేత్రంలో విద్యాసంస్థల్లోని విద్యార్థినీ విద్యార్థులు తొమ్మిది నాటకాలను ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో తమ అభినయంతో ప్రేక్షకులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు కళారంగంలో కూడా నైపుణ్యం పెంపొందించాలనే ఉద్యేశ్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి నాంది పలికామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో వున్న కళానైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహద పడతాయన్నారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్ సింగ్, ప్రిన్సిపల్స్ జాస్మిన్, నాగేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మార్పు కోసమే తీర్పు

## - ఎమ్మెల్యే సంజీవయ్య



నిన్నటి ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు పరిపాలనలో మార్పును కోరుకుంటూ తీర్పునిచ్చారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఈ నెల 24న ఆయన నాయుడుపేటలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వెలుపలకు వచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నిలలో వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్ర ప్రజలకు త్వరలోనే మంచిరోజులు రానున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సాగునీళ్ళు, తాగునీళ్ళ కొరత లేకుండా చల్లని చూపు చూడమని పోలేరమ్మ తల్లిని కోరినట్లు చెప్పారు. వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని, రాష్ట్రంలో రాజన్న సంక్షేమ రాజ్యం తిరిగి రానుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, 786 రఫి, వేణుంబాక విజయశేఖర్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, కళతత్తూరు రామ్మోహన్‌రెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, వి.పి.కుమార్‌రెడ్డి, తంబిరెడ్డి మోహన్‌రెడ్డి, కురుగొండ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహాజ్ఞాన నిధి.. మహాకవి కాళిదాసు



డా. సూరం శ్రీనివాసులును సన్మానిస్తున్న నిర్వాహకులు

మహాకవి కాళిదాసు మహాకవి పండితుడు..మహాజ్ఞాన విజ్ఞాన నిధి అని, తన అద్వితీయమైన రచనాప్రతిభతో కవికుల గురువుగా ప్రసిద్ధిచెందాడని ప్రముఖ సారస్వతవేత్త డా.సూరం శ్రీనివాసులు అన్నారు. ఈనెల 20న నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో కుమారి పునుగు రమామణి స్మారకనిధి ఆధ్వర్యంలో స్థానిక రేబాల లక్ష్మీనరసారెడ్డి(జూనియర్) స్మారకభవనంలో కాళిదాస జయంతి సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మహాకవి కాళిదాసు రచనలు అత్యద్భుతమైనవన్నారు. అమోఘమైన రచనాశైలి కాళిదాసు సొంతమన్నారు. కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం' ప్రాముఖ్యత గురించి ఆయన ఉపన్యసించి, కుమారి పునుగు రమామణి స్మారకనిధి తరపున టి.రవిచంద్రన్, శ్రీమతి అపర్ణల నుంచి సమ్మానం అందుకున్నారు. సాహితీవేత్తలు మోపూరు వేణుగోపాలయ్య, కరిమద్దెల నరసింహారెడ్డి, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యం, వర్ధమాన సమాజం అధ్యక్షులు బత్తినపట్ల శేషారెడ్డి, వల్లకవి వేంకటసుబ్బారావు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన..
# వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు




నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 24న వైభవంగా ముగిసాయి. ఈనెల 19న గిన్నె భిక్ష, గరుడసేవ, 20న స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, 21 న రథోత్సవం, పుష్పక విమాన అలంకారం, 22న వెన్నతాళి, అశ్వవాహనం, 23న తీర్థవాది, పొన్నవాహనోత్సవం, 24న చక్రస్నానం, ఏకాంతసేవ, పుష్పయాగం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. నేత్రపర్వంగా జరిగిన ఈ ఉత్సవాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ప్రతి రోజు సాయంత్రం కవి పండిత ఉపన్యాసకులు ఆలూరి శిరోమణి శర్మ శ్రీ భాగవత ప్రవచనాలపై ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, మేనేజర్ వి.గిరికృష్ణ, రాజు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

### అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం

శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తలమండలి ఛైర్మన్ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి ఈనెల 24న రాత్రి దేవస్థానం ఆవరణంలో విలేఖర్ల సమావేశం నిర్వహించి భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో అన్ని ఉత్సవాలను నిర్వహించామన్నారు. అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు సహకరించిన దేవస్థానం సిబ్బంది, ఉభయకర్తలు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేకంగా దేవదాయ ధర్మదాయశాఖ సహాయకమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్, మునిసిపల్, పోలీసు శాఖ, దేవస్థానం సిబ్బంది అందించిన సేవలను కొనియాడారు.

## ఒక మంచి పుస్తకం..
# వందమంది మిత్రులతో సమానం

## - విఆర్‌సిలో ప్రపంచ పుస్తకదినోత్సవంలో వక్తలు




మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రావు

మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానమని, ఆదిమ కాలం నుంచి అంతరిక్షం దాకా మానవ మేధస్సు సృష్టించిన మహత్తర అంశాలెన్నో పుస్తకాల్లో నిక్షిప్తమై ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. ఈనెల 22న ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నెల్లూరు విఆర్‌సి గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రావు మాట్లాడుతూ పుస్తకాలు లేని గది.. ఆత్మ లేని శరీరం లాంటిదని అభివర్ణించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పుస్తకపఠనాన్ని అలవాటు చేసేందుకు యునెస్కో ఏటా ఏప్రిల్ 23న అంతర్జాతీయ పుస్తక దినోత్సవాన్ని ఏర్పాటుచేయడం ప్రశంసనీయమని కొనియాడారు. గ్రంథాలయం అధికారి డా.ఎన్ ప్రభాకర్, అధ్యాపకులు బాబర్ ఆలీమొహిద్దీన్, డా. పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.


# అప్పుడే ఏడాదయ్యింది



స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు జిల్లా రాజకీయాలకే వన్నెతెచ్చిన అందగాడు, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఈ నెల్లూరును, ఈ లోకాన్ని వీడి ఈ నెల 25వ తేదీకి ఏడాది అయ్యింది. గత యేడాది ఏప్రిల్ 25వ తేదీన ఆయన అనారోగ్యంతో స్వర్గస్తులు కావడం తెలిసిందే! ఈ యేడాదిలో ఆయన లేని లోటు పలు సందర్భాల్లో కనిపిస్తూనే వుంది. ముఖ్యంగా ఆయన లేకుండా జరిగిన నిన్నటి ఎన్నికలు చాలా నిస్సారంగా అనిపించాయి. ఆయన మరణించి ఏడాది అయినా కూడా ఆయనతో అనుబంధం ఉన్న ప్రతిఒక్కరికీ ఇప్పటికీ ఆయన నెల్లూరు నగర రోడ్లపై తిరుగుతున్నట్లే మనసులకు అనిపిస్తుంది.

# గురువుల బోధనలు ఆచరిస్తే.. జీవితాలు ధన్యం

## - శ్రీ దండి నిర్మలానందగిరి స్వామీజీ



## శ్రీకాళహస్తి న్యూస్

గురువుల బోధనలను చిత్తశుద్ధితో విని, వాటిని ఆచరిస్తే జీవితాలు ధన్యమవుతాయని తెనాలి అష్టలక్ష్మి పీఠాధిపతి దండి నిర్మలానందగిరిస్వామీజీ అన్నారు. శ్రీకాళహస్తిలోని శ్రీ శుక బ్రహ్మాశ్రమంలో అయిదురోజుల పాటు జరిగిన గురుదేవుడు విద్యాప్రకాశానందగిరి స్వామీజీ 21వ పుణ్యారాధన, 106వ జయంతి, 69వ ఆశ్రమ వార్షికోత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో నిర్మలానందగిరి స్వామీజీ మాట్లాడుతూ జగత్తు మిథ్య అని జీవుడు తెలుసుకోవాలన్నారు. జీవుడు విచారంతోనే కర్మఫలం విముక్తిని పొందాలన్నారు. శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామీజీ మాట్లాడుతూ ఆశ్రమంలో నేత్రవైద్యశాల ఏర్పాటుచేసి ఎందరో అభాగ్యులకు కంటివైద్యం అందిస్తున్నామన్నారు. ఆశ్రమ ఉత్తరపీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామీజీ మాట్లాడుతూ మానవుడు శాంతి, సుఖం పొందాలంటే ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలన్నారు. మలయాళ సద్గురు సేవా సమాజం అధ్యక్షులు డా.సముద్రాల లక్ష్మణయ్య మాట్లాడుతూ శ్రీ మలయాళస్వాముల వారు ఆంధ్ర దేశానికి ఆధ్యాత్మిక భిక్షపెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ సమాజంలో అందరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలని, పరోపకారబుద్ధితో జీవితాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డా.కరిబసవ రాజేంద్రమహాస్వాములవారు, ప్రణవానందగిరి స్వామీజీ, సర్వాత్మానందగిరి స్వామీజీ, శంకరానందగిరాస్వామీజీ, యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ, శ్రీ మాతా శివానంద సరస్వతి స్వామిని, మాతా జ్యోతిర్మయానంద భారతిస్వామిని, కైలాసానందగిరి స్వామీజీ, బొాదు చంద్రశేఖర స్వామి, బ్రహ్మశ్రీ డా.ఓ.ఎస్ రామలాల్ వర్మ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు డా.ద్వారం లక్ష్మి, ఆశ్రమ మేనేజర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్టరీగా..
# వెంకన్నాన్స్ గోల్డ్

సాధారణంగా తిరుమల వెంకన్నకు భక్తులు మొక్కుబడిగా నిలువు దోపిడీ ఇస్తుంటారు. కాని, ఇప్పుడు ఆ వెంకన్ననే నిలువుదోపిడీ చేసే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయా అనిపిస్తోంది. స్వామివారి పింక్ డైమండ్ ఏమైందో తెలియదు? ఎన్ని నగలున్నాయో, ఎన్ని నగలు మాయమయ్యాయో లెక్కలేదు. గతంలో కిరీటాలు మాయమయ్యాయి. గత ఐదేళ్ళకాలంలో రాష్ట్ర ప్రభుత్వమైతే టీటీడీ నిధులనే ఓట్ల కార్యక్రమాలకు దారి మళ్ళించడం చూశాం!

2004–2009ల మధ్య దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడు ఆయనపై అనేక రకాలుగా దుష్ప్రచారం చేశారు. కాని, ఆయన హయాంలో తిరుమల పవిత్రతను కాపాడారు. టీటీడీ నిధులను దైవ కార్యాలకే వాడారు. 'దళిత గోవిందం' వంటి కార్యక్రమాల ద్వారా దేవుడిని భక్తులు, ముఖ్యంగా దళితుల చెంతకు తీసుకెళ్ళారు. కాని, ఇప్పుడు టీటీడీ నిధులు హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం కాకుండా తెలుగుదేశం పార్టీ ఓట్ల కార్యక్రమాల కోసం దారి మళ్ళిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కాగా, ఇప్పుడు శ్రీవారికి చెందిన 1381కిలోల బంగారం తరలింపు పెను సంచల నంగా మారింది. తమిళనాడులో నిర్వహించిన ఎన్నికల సోదాలలో 1381 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేవు. అంత బంగారాన్ని రవాణా చేస్తుంటే కనీస భద్రత లేదు. ఈ బంగారాన్నేమో టిటిడికి తరలిస్తున్నట్లుగా చెబుతున్నారు. టిటిడిది అయినప్పుడు అంత అజాగ్రత్తగా తరలిస్తారా? టిటిడి ఇ.ఓ మాత్రం మాకు చేరేంతవరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు వారిదే బాధ్యత అని చెపుతాడు. మరి ఆ బ్యాంకు వాళ్ళు కనీస సెక్యూరిటీ కూడా లేకుండా ముందస్తు సమాచారం కూడా లేకుండా ఇన్ని వందలకిలోల బంగారాన్ని ఎక్కడకు తీసుకెళుతున్నారనుకోవాలి!?

దీనిపైనే అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. టిటిడికి కూడా సమాచారం లేకుండా ఈ బంగారాన్ని ఎక్కడకు తరలిస్తున్నారనుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ జరిపితేగాని అసలు విషయాలు వెలుగులోకి రావు.

# కుల గబ్బుసింగ్

(మొదటి పేజీ తరువాయి)

మాట రాకుండా జాగ్రత్తపడ్డారు. కాని, కులాల గోడలను కూల్చేద్దామంటూ ఎవరైతే రాజకీయ పార్టీని పెట్టారో ఆ నాయకుడే కులాల కంపును ఎక్కువగా కలబెట్టాడు. ఆ మహానుభావుడెవరో కాదు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్.

ఈ ఎన్నికల్లో ఆయన కులమతాల కతీతంగా రాజకీయాలు నడుపుతానంటూనే కుల, మతాల ప్రస్తావన తెచ్చాడు. ముఖ్యంగా గోవులను చంపి తింటే తప్పేంటంటూ హిందువుల మనోభావాలను గాయపరిచాడు. రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూనే కాపులకు 15శాతం రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేశాడు. తాజాగా 'రెడ్డి' కులంపై పడ్డాడు. 'రెడ్డి' అనేది కులం కాదని, బ్రిటీష్ కాలంలో కాపలాదారులకు 'రెడ్డి' అనే బిరుదులు ఇచ్చారని, అలా రెడ్డి అనే కులం వచ్చిందని తన పైత్యాన్ని జోడించి చెప్పాడు. 'రెడ్డి' అనే కులం సబ్జెక్టే ఇక్కడ పవన్‌కు అవసరం లేదు. పవన్ అభిమానుల్లో అన్ని కులాల వాళ్ళు, అన్ని మతాలవాళ్ళున్నారు. ఏ వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా నడుచుకోవడం నాయకుడి లక్షణం. పవన్‌లో ఆ లక్షణాలు ఏ కోశానా కనిపించలేదు. బహుశా పవన్ చదివిన 2లక్షల పుస్తకాలలో రెడ్డిరాజుల చరిత్ర లేదేమో? చిరంజీవి పార్టీని నడపలేక కాంగ్రెస్‌లో విలీనం చేసినా ఇలా నీచంగా మాట్లాడి తన స్థాయిని తగ్గించుకోలేదు. పవన్‌కు సినిమాలలో ఆ గౌరవం పోయింది. రాజకీయాలలోనూ చపలత్వంతో తన స్థాయిని తానే దిగజార్చుకుంటున్నాడు.

# పవర్ వార్


(మొదటి పేజీ తరువాయి)

ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా చేయలేదు. మరి చంద్రబాబే ఎందుకు ఇలా చేస్తున్నాడు. ఆయన రాష్ట్ర ప్రజల మీద ప్రేమతో ఇవన్నీ చేస్తున్నట్లుగా లేదు. దేనికో భయపడి, ఎవరికో భయపడుతూ చేస్తున్నట్లుగా వుంది.

ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా ఎన్నికల కమిషన్ పునీతచంద్రను తొలగించి ఎల్.వి.సుబ్రహ్మణ్యంను నియమించడమే చంద్రబాబు కన్ను అదిరేలా చేసింది. సిఎస్‌గా ఎల్.వి.సుబ్రహ్మణ్యం నియామకంతోనే ఆయన గుండెల్లో డేంజర్‌బెల్స్ మోగాయి.

ఎన్నికలు ముగిశాక రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలలో సీఎం చంద్రబాబు, సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యంల మధ్య వార్ మొదలైంది. ఎన్నికలకు ముందే చంద్రబాబు ఆర్థిక నేరాల్లో నిందితుడిని సిఎస్‌గా ఎలా నియమిస్తారంటూ ప్రశ్నించి ఆయనతో పెట్టుకున్నాడు. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చాక కూడా ఆయనను నిందితుడుగా ఎలా సంబోధిస్తారంటూ చంద్రబాబుకు సీనియర్ ఐఏఎస్‌లు చీవాట్లు పెట్టారు. ఎన్నికల తర్వాత ఎల్.వి.సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాడు. ఎన్నికల కోడ్ అమలులో వున్నంతకాలం రాష్ట్రానికి సీఎస్సే సుప్రీం. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు మాత్రమే మంత్రివర్గం జోక్యం చేసుకోవచ్చు. సాధారణ పరిపాలన సీఎస్సే చూసుకుంటాడు. ఈ నేపథ్యంలో సీఎస్ అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలు మొదలుపెట్టాడు. ముఖ్యంగా ఎన్నికలకు కేవలం కొన్నిరోజుల ముందే రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలపై సమీక్షకు పూనుకున్నాడు. ఆర్థిక శాఖాధికారుల వద్ద నుండి పూర్తి వివరాలు సేకరించారు. 'పసుపు – కుంకుమ', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాల పేర్లతో ఓట్ల కోసం చంద్రబాబు ఖజానాను ఖాళీ చేయడం తెలిసిందే! కనీస అవసరాలకు కూడా నిధులు లేకుండా, ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించే పరిస్థితి లేకుండా ఖజానాను ఖాళీ చేయడం అన్నది ఎప్పుడూ జరగలేదు. చంద్రబాబు చేసిన అప్పులు, దుబారా, బ్యాంకు ఓడిలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయనున్నాయి. ఈ ఆర్థిక లావాదేవీలపైనే ఎల్.వి. సుబ్రహ్మణ్యం సమీక్షలు నిర్వహిస్తుండే సరికి ఈ లెక్కల్లో తమ బొక్కలు ఎక్కడ బయటపడతాయోనని తెలుగు దేశం నాయకులు బెంబేలెత్తుతున్నారు.

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు లాంటి వాళ్ళు మోకాలికి బోడిగుండుకు ముడిపెడుతూ జగన్ వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారిపోయిందంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఒక్క ఐఏఎస్ అధికారి ఒక వారం గట్టిగా పని చేస్తేనే వీళ్ళకు ఇంతగా చెమటలు పడుతున్నాయి. అదే రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై సిబిఐ లెవల్లో దర్యాప్తుకు ఆదేశిస్తే వీళ్ళ పరిస్థితి ఏంటో?!

# మీ ఆలోచనలు దేశాభివృద్ధికి తోడ్పడాలి




- విద్యార్థులకు ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపు
- శ్రీసిటీలో ఘనంగా ట్రిపుల్ఐటీ స్నాతకోత్సవ వేడుకలు
- విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన ఉపరాష్ట్రపతి ప్రసంగం

"మీరు ఏ రంగాన్ని ఎంచుకున్నా సరే.. దేశ ప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకోవాలి. మీ ఆలోచనలు దేశాభివృద్ధికి తోడ్పడాలి. అలా చేయడం ద్వారా మీరు భావితరాలకు మార్గదర్శకులుగా ఉంటారు".. అని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈనెల 23న శ్రీసిటీ పరిధిలోని ట్రిపుల్ఐటీ కళాశాల తొలి స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంతో ఆకట్టుకునేలా ఉన్న ఉపరాష్ట్రపతి ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. శ్రీసిటీ ట్రిపుల్ఐటీ కళాశాలలో విద్యార్థులు గోల్డ్మెడల్ సాధించడం ఒక తొలిమెట్టు మాత్రమేనని, మీ మేధస్సు దేశాభ్యున్నతికి బాటలు వేయాలని ఉపరాష్ట్రపతి విద్యార్థులనుద్దేశించి అన్నారు. చదువుతో పాటు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, మంచి ఆలోచన.. పట్టుదల పెంపొందించుకుంటే ఉన్నతశిఖరాలను చేరుకోవచ్చని, అలా విద్యార్థులు భావితరాలకు స్ఫూర్తిప్రదాతలుగా నిలవాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. విద్యార్థుల చదువులు శాస్త్రీయతకే కాకుండా దేశంలో శాంతి భద్రతల కల్పనకు, సమాజసేవకు, సమాజాభివృద్ధికి ఎంతో ప్రయోజనకరంగా ఉండాలన్నారు. గతంలో పలు దేశాలు మనదేశాన్ని ఆక్రమించి వారి గుప్పెట్లో ఉంచుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ, అయినప్పటికీ భారతదేశం మాత్రం ఏ దేశాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించలేదన్నారు. మన పూర్వీకుల నుంచి మనం నేర్చుకున్న శాంతియుత మార్గంలోనే జాతిపిత మహాత్మాగాంధీ పయనించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిన విషయాన్ని ఆయన విద్యార్థులకు గుర్తుచేశారు. రానున్న రోజుల్లో భారత్ ప్రపంచంలో ఆర్థికంగా మరింత బలమైన దేశంగా రూపొందుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా అన్నారు. అందుకు దేశ ప్రధాని, రాష్ట్రముఖ్యమంత్రులు మాత్రమే కృషిచేస్తే సరిపోదని, ప్రతి పౌరుడు సహకరించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యసాధన కృషితో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీని బాగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం, శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ నుంచి పట్టభద్రులైన తొలి బ్యాచ్ విద్యార్థులకు ఆయన తన అభినందనలు తెలిపారు. మారుమూల ప్రాంతమైన సత్యవేడు సమీపంలో ఎన్నో పరిశ్రమలను ఏర్పాటుచేసి ఎందరికో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించిన శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజుతో పాటు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డిని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు.


భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, ఎండి రవి సన్నారెడ్డి

## ఉపరాష్ట్రపతి రాక.. ఎంతో సంతోషం

**- శ్రీసిటీ ఛైర్మెన్**

ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు మాట్లాడుతూ, శ్రీసిటీ ట్రిపుల్ఐటి కళాశాల తొలి స్నాతకోత్సవానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచ్చేయడం తమకెంతో సంతోషం కలిగిస్తోందని అంటూ ఇక్కడ 135 మంది విద్యార్థులు పట్టభద్రులైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎం.డి రవి సన్నారెడ్డి, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిజె నారాయణన్, ఐఐటి తిరుపతి ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత శ్రీసిటీ ఛైర్మెన్, ఎం.డిలు శ్రీనిరాజు, రవి సన్నారెడ్డిలు ఉపరాష్ట్రపతిని సాదరంగా ఆహ్వానించి జ్ఞాపికలు అందజేశారు.

## ఉపరాష్ట్రపతికి తడలో ఘనస్వాగతం...

శ్రీసిటీ పర్యటన నేపథ్యంలో తొలుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రత్యేక రైలులో చెన్నై నుంచి తడ రైల్వేస్టేషన్కు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, ఎం.డి రవి సన్నారెడ్డి తదితరులు ఉపరాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీసిటీకి చేరుకుని, అక్కడ ట్రిపుల్ ఐటి కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న తర్వాత, తిరిగి తడ రైల్వేస్టేషన్కు చేరుకుని, ప్రత్యేకరైలులో చెన్నైకి బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా తడ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ఆర్ నాయుడు, నెల్లూరు నగర బిజెపి అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, నాయకులు మొగరాల సురేష్, విజయభాస్కర్రెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, ఇమ్మానేని శ్రీనివాసరావు, రాచర్ల కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొని, ఉపరాష్ట్రపతిని కలిసి సాదరంగా స్వాగతించారు.

# కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను మరువకూడదు

### చెన్నైలో డా.కేసరి విద్యాసంస్థల ప్లాటినం జుబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు




మనం ఎక్కడున్నా కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను మరువకూడదని, మన దేశాన్ని, మన భాషను, మన సంస్కృతి సంప్రదాయాలను ఎవరూ విస్మరించకూడదని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. చెన్నైలోని త్యాగరాయనగర్లో ఈనెల23న జరిగిన కేసరి మహోన్నత పాఠశాలల ప్లాటినం జుబ్లీ వేడుకల్లో ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మభాషను ఎవరూ మరచిపోకూడదన్నారు. తమిళనాట తెలుగు పాఠశాలలకు రాష్ట్రప్రభుత్వం గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో తమిళులకు వారి మాతృభాషలోనే విద్యనభ్యసించే సదుపాయం ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా తమిళనాట కూడా ఆ సదుపాయాన్ని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమిళనాడులో తెలుగువారు భాషా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను డాక్టర్ సిఎంకె రెడ్డితో పాటు పలువురు తెలుగు ప్రముఖులు కలిసి తనకు వివరించారని, ఆ సమస్యల సాధనకు కృషిచేస్తామని ఆయన అన్నారు. భారతీయ ధర్మంలో పరోపకారానికి ఉన్నతస్థానం ఇచ్చారని, ధర్మం సామాజికపరమైన జీవన విధానమని అంటూ ప్రతిఒక్కరూ తమ సంపాదనలో, ఆదాయంలో కొంతభాగాన్ని సమాజం కోసం వెచ్చించాలని సూచించారు. గురువులకు అత్యున్నతస్థానం కల్పించిన సంస్కృతి కూడా మనదేనని, నేటి అధునాతన గూగుల్ కంటే గురువులే గొప్ప అని అన్నారు. ఈ విద్యాసంస్థలను నెలకొల్పిన డాక్టర్ కెవెన్ కేసరి సంకల్పం ఎంతో గొప్పదని, స్వయంకృషితో ఎదిగిన మహనీయుడని ఆయన ప్రశంసించారు. ఆయుర్వేదవైద్యునిగా రాణించిన కేసరి, చిన్నప్పుడు చదువుకోసం తాను పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆ బాధలు మరొకరు పడకూడదనే ఉద్దేశంతో 1943లో ఈ పాఠశాలలను నెలకొల్పారని, వేలాదిమందికి ఈ విద్యాసంస్థల ద్వారా విద్యనందిస్తున్నారని, అప్పట్లోనే స్త్రీ విద్యకు కూడా ఎంతో ప్రాధాన్యమిచ్చారని ఆయన ప్రశంసించారు. సుమారు 75 సంవత్సరాల క్రితం కేసరి కుటీరం పేరుతో ఆయుర్వేద ఔషధాలు తయారుచేసి బాగా ధనం ఆర్జించిన పిమ్మట సమాజసేవ వైపు దృష్టి సారించి గృహలక్ష్మి అనే పత్రిక కూడా నడిపి స్త్రీమూర్తులను స్వర్ణకంకణంతో సత్కరించిన మహాపురుషుడు అని ఆయన కొనియాడారు. తొలుత ఈ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కెవెన్ కేసరి శిలావిగ్రహానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసరి పాఠశాలలు 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బన్వర్లాల్ పురోహిత్, శ్రీ కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ తదితరులు పాల్గొని డాక్టర్ కెవెన్ కేసరి సేవలను కొనియాడారు.

### కొత్త భవన నిర్మాణానికి భూమిపూజ

డాక్టర్ కెవెన్ కేసరి మహోన్నత పాఠశాలల ప్లాటినం జుబ్లీ సందర్భంగా పాఠశాల ఆవరణలో కొత్త భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం కేసరి ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.రాధాకృష్ణన్, సెక్రటరీ కెవెస్వి ప్రసాద్, ట్రెజరర్ కె.శ్రీనివాసప్రసాద్, జాయింట్ సెక్రటరీ పట్టాభిరామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.గోపాలయ్య తదితరులు ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు. కేసరి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ కెవెస్వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కెన్సస్ అధినేత నరసారెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ ఈ నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని, తన స్నేహితులను కూడా ఇందులో భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నైలోని తెలుగు ప్రముఖులు డాక్టర్ సిఎంకె రెడ్డి, అనిల్కుమార్రెడ్డి, మాజీ ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆస్కా ఆదిశేషయ్య, తంగుటూరి రామకృష్ణ, కాట్రగడ్డ ప్రసాద్, గొల్లపల్లి ఇస్రాయేలు, గుడిమెట్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com